J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 4 30.6.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# చంద్రబాబుకి చంద్రశేఖర్ బాసట!

## ఆంధ్రా కంటే మన రాష్ట్రం సూపర్ అంటున్న తెలంగాణ సీఎం



- అవకాశం దొరికినప్పుడల్లా ఆంధ్రా ప్రభుత్వంపై విమర్శలు
- నారాకి కలిసొస్తున్న కల్వకుర్తి వ్యాఖ్యలు
- బాబు రుణం తీర్చుకుంటున్న కేసీఆర్

*"ఒకప్పుడు ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మి తెలంగాణలో 5 ఎకరాలు కొనుక్కునేవారు. ఇప్పుడు అదే తెలంగాణలో ఒక ఎకరం అమ్మి ఆంధ్రాలో 50 ఎకరాలు కొనుక్కుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన కారణంగా పటాన్‌చెరు ప్రాంతంలో ఎకరం 30 కోట్లు పలుకుతోంది, 30 కోట్లతో ఆంధ్రాలో 100 ఎకరాలు వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు"...*

ఈ మాటలు అన్నది ఎవరోకాదు. సాక్షాత్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు. ఇటీవల హైదరాబాదులో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో చెప్పడానికి కేసీఆర్ ఆంధ్రాని బలిచేసి మాట్లాడారు. గతంలో కూడా పలు సందర్భాలలో ఆయన కుమారుడు, తెలంగాణ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు తెలంగాణ నేతలు కూడా ఆంధ్రాలో అభివృద్ధి లేదంటూ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనపై నేరుగానే విమర్శలు గుప్పించారు. తమ రాష్ట్రం అభివృద్ధి చెందిందని చెప్పే క్రమంలో ఆంధ్రరాష్ట్ర ప్రగతిని పోల్చి మాట్లాడడం చంద్రబాబుకి కలిసొచ్చే అంశంగా ఇప్పుడు రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2001లో చంద్రబాబు చేసిన చిన్న పాపం ఆంధ్రా ప్రజలకు శాపంగా మారింది. బాబు చేసిన అదే తప్పిదం కల్వకుంట్ల చంద్రశేఖరరావు దశ దిశ మార్చేసింది. 'అంతా మన మంచికే' అని మన పెద్దలు చెప్పిన సామెతకి సజీవసాక్ష్యంగా కేసీఆర్‌ని చూపించవచ్చు. బాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వంలో 2001 ఏప్రిల్‌లో జరిగిన మంత్రివర్గ విస్తరణలో కేసీఆర్ ఆశించినట్లుగా ఒక్క మంత్రి పదవి ఆనాడు చంద్రబాబు ఆయనకి ఇచ్చి వుంటే ఈరోజు ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఉండేదికాదు. తెలంగాణ ఏర్పడి ఉండేదే కాదు. కొత్త రాష్ట్రానికి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యి ఉండేవారు కూడా కాదు. అప్పుడు బాబు చేసిన తప్పు ఒక్క ఆంధ్రాకే ముప్పు కాకుండా తన రాజకీయ భవిష్యత్‌కే ప్రమాదం తెచ్చిపెడుతుందని ఆనాడు బాబు ఊహించకపోయి ఉండవచ్చు.

2004లో రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం, 2009లో అతి కష్టం మీద మళ్ళీ కాంగ్రెస్‌పార్టీని గట్టెక్కించిన

10లో



# కంటివ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**- నేత్రవైద్యులు డాక్టర్ రాజశేఖర్**



కంటివ్యాధులను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని, వాటిపట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక దశలోనే తగు చికిత్సలు చేయించుకోవాలని ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ పి.రాజశేఖర్ చెప్పారు. ఈనెల 25న నెల్లూరులోని ఆచారివీధిలో ఉన్న క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంటిచూపు పట్ల ఎవరికి వారు అవగాహన కలిగివుండాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ నిర్వాహకులు డాక్టర్ రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చుండూరు కృష్ణమూర్తి, అద్దేపల్లి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుకూరులో పశుపోషణపై అవగాహన

ముత్తుకూరులోని నిర్వాసిత కాలనీవాసులకు ఇటీవల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞానంపై అవగాహన కల్గించారు. ప్రాంతీయ పశువైద్యశాల సంచాలకురాలు డాక్టర్ నిర్మల, మండల ఎంపీపీ గండవరం సుగుణ పాల్గొని పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు వివరించారు.



**'గురుపౌర్ణమి'**

# వేడుకలకు భిక్షాటన

జులై 3న గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా సాయినాథునిపై భక్తిశ్రద్ధలతో భిక్షాటన చేసి, సేకరించిన బియ్యం, సరుకులతో అన్నదానం నిర్వహించాలని బోగోలులోని సాయిసేవకులు, మహిళాభక్తులు భిక్షాటన ప్రారంభించారు. బోగోలు షిర్డీ సాయి మందిరంలో ఆరోజున స్వర్గీయ అమరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. భిక్షాటనకు వచ్చిన సాయిభక్తులకు సహాయం అందించాలని మందిరం నిర్వాహకులు డాక్టర్ ఆనంద్ సాగర్ విజ్ఞప్తిచేశారు.

# రాష్ట్రంలో విద్యారంగం నాశనం

**- యుటిఎఫ్ నాయకుల ఆందోళన**




రాష్ట్రంలో విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని, విలీనం పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసివేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని, ఉపాధ్యాయులను తొలగింపులతో వేధింపులకు గురిచేస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25న నెల్లూరులో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నచ్చజెప్పి వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం గోడపత్రాలను ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వివి శేషులు, నాయకులు వెంకటేశ్వర్లు, మురళీధర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# పేదపిల్లలకు విద్యాసామగ్రి



**భార్గవ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వితరణ**

నెల్లూరులోని భార్గవ్ ఎడ్యుకేషనల్ సొసైటీ (బిఇఎస్) ఆధ్వర్యంలో ఈనెల 25న స్థానిక బాలాజీనగర్‌లోని ఏఆర్‌డివిఓ అంధుల పాఠశాలలోని అంధ విద్యార్థులకు, పేద పిల్లలకు 40 మందికి పుస్తకాలు, పెన్‌లు, నూరు కేజీల బియ్యం తదితర సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు భార్గవ్‌రామ్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులతో ఏర్పడిన తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పూజిత, ఇమ్రాన్, సొసైటీ సభ్యులు షంశీర్, శభాజ్, మస్తాన్, మెనిష్, తేజస్విని, అరుణ, అశ్విని, లాలస, నారాయణ తదితరులు పాల్గొన్నారు.




**కనుపర్తిపాడు సుబ్రహ్మణ్యేశ్వరునికి**

# ప్రత్యేక పూజలు



నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడులో ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణాన్ని కనువిందుగా చేపట్టారు. అనంతరం, చప్పరోత్సవం, శేషవాహనసేవలను నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి–గిరిజమ్మ దంపతులతో పాటు చెన్నైకి చెందిన విస్సా కశ్యప్–లలిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి ఉత్సవాలను దర్శించుకున్నారు.

# పార్టీ మారను.. వైకాపాను వీడను

## సోమిరెడ్డి దుష్ప్రచారాన్ని నమ్మకండి - స్పష్టం చేసిన ఆదాల



తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారేది లేదని, వైకాపాను వీడేది లేదని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజక వర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ వారు తాను పార్టీ మారుతానంటూ మైండ్‌గేమ్ ఆడుతున్నారని, అలాంటివన్నీ అవాస్త వాలు.. అభూతకల్పనలేనని, వాటిని నమ్మ కండని ఆయన ఈనెల 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ని కలు సమీపించే తరుణంలో తాను పార్టీ మారతానంటూ తెలుగుదేశం పార్టీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పడం దురుద్దేశపూరితమన్నారు. తనపై సోమిరెడ్డి లేనిపోని దుష్ప్రచారాలు చేయడం, అవాస్త వాలను ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రజలు సోమిరెడ్డికి ఎన్ని గుణపాఠాలు చెప్పినా ఆయనకింకా జ్ఞానోదయం కలగడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై అపారమైన విశ్వాసంతో తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించారని, ప్రజలు సీఎం నమ్మకానికి ఆమోదం తెలిపి ఎంపీగా అత్యధిక మెజార్టీతో తనను గెలిపించారని గుర్తుచేశారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభ్యర్థిగా అందరికంటే ముందుగా ప్రకటించి తనపై ఉన్న నమ్మ కాన్ని వెల్లడించారని, సిఎం నమ్మకాన్ని కాపాడుకుంటానని, ఎట్టిపరిస్థితుల్లోనూ వైకాపా అభ్యర్థిగానే తాను నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉంటానని ఆదాల పేర్కొన్నారు. తాను రూరల్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని తెలిసి ఒక పథకం ప్రకారం టీడీపీ మోసపూరితమైన ప్రచా రాన్ని ప్రారంభించిందని, గత నాలుగు నెలలుగా ఇలాంటి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ప్రజలను అయోమయానికి గురిచేసి తనకు, పార్టీకి నష్టం కలిగించా లనేదే టీడీపీ ఉద్దేశమని, అయితే అలాంటి వాటిని ప్రజలెవరూ నమ్మబోరని ఆయన పేర్కొన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అందుకు ప్రజలనుంచి అద్భు తమైన స్పందన లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమని, మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డే సిఎం అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కుయుక్తులతో లబ్దిపొందాలని భావి స్తోందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెల వడం కల్ల అని ఆయన పేర్కొంటూ, ప్రజల చేత ఎన్నోసార్లు తిరస్కరణకు గురైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇలాంటి తెలివిలేని మాటలు మాట్లాడడం, లేని పోని దుష్ప్రచారాలు చేయడం ఏమిట న్నారు. జిల్లా ప్రజలే కాదు రాష్ట్ర ప్రజలు కూడా ఆయన మాటలను నమ్మబోరని ఆదాల పేర్కొన్నారు.



## ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి.. సీఎం జగన్ ఆశీస్సులు

తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.


# ఎంవి రాయుడుకు 'తానా' పురస్కారం

## గిడుగు రామమూర్తి అవార్డుకు ఎంపిక



'మనసు ఫౌండేషన్' ద్వారా తెలుగుభాషకు విశేష సేవలందిస్తున్న డాక్టర్ ఎంవి రాయుడు (మన్నవ వెంకట రాయుడు) అమెరికాలో ప్రతిష్టాత్మకమైన 'తానా' పుర స్కారం అందుకోనున్నారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభలు ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో పెద్దఎత్తున నిర్వహించను న్నారు. జులై 7, 8, 9 తేదీల్లో జరిగే ఈ మహాసభల్లో వివిధ రంగాల్లో విశిష్టసేవలందిస్తున్న వారిని ఎంపికచేసి వారికి తానా తరపున అవార్డులు, పురస్కారాలు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి అవార్డును డా.ఎం.వి రాయుడుకు ప్రదానం చేయనున్నట్లు తానా నిర్వాహకులు పేర్కొన్నారు. అమెరికాలో ఆయన ఈ అవార్డును అందుకోనుండడం పట్ల ఆయన సహచరులు, తెలుగు భాషాభిమానులు, పలువురు సాహితీవేత్తలు ఆనందాన్ని వ్యక్తంచేసి ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# త్వరలోనే జాబిల్లిపైకి మన రాకెట్!



- 'చంద్రయాన్'-3కి షార్‌లో భారీ సన్నాహాలు
- శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు
- అన్నీ అనుకూలిస్తే.. జూలై 13న ప్రయోగం

***అం**తరిక్షరంగంలో తనదంటూ ప్రత్యేకప్రతిభతో అనేక విజయాలు సాధిస్తూ రాకెట్ వేగంతో ముందుకుపోతున్న భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఎప్పుడెప్పుడా అని అందరూ ఎదురుచూస్తున్న చంద్రయాన్ ప్రయోగానికి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తేదీ మాత్రం ఇంకా ఖరారు కాకపోయినా, అన్నీ అనుకూలిస్తే జూన్ 13వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి చంద్రయాన్ రాకెట్ ప్రయోగం చేపట్టాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అందుకు సంబంధించి ఉపగ్రహ అనుసంధానం, రోవర్, లాండర్‌లను ఏర్పాటుచేయడం వంటి పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి.*

శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుంచి మార్క్-3 భారీ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రయో గానికి సంబంధించి ముఖ్యమైన పనులన్నీ దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు చెప్తున్నారు. ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో షార్ శాస్త్రవేత్తలు ఈ ప్రయో గానికి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రయోగం విజయవంతమైతే అంతరిక్ష రంగంలో భారత్ ప్రతిష్ట మరింతగా పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### అందరి చూపు.. 'చంద్రయాన్' వైపు :

మరికొద్ది రోజుల్లోనే భారత్ నుంచి మరోసారి చంద్రయాన్ ప్రయోగం జరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ శాస్త్రవేత్తలంతా భారత్ వైపు చూస్తున్నారు. 2008లో చంద్రయాన్-1 ప్రయోగం జరగడం, చందమామ ఉపరితలంపై నీరున్న జాడలను గుర్తించడం జరిగాయి. అయితే ఏడాదిలోనే ఏదో సాంకేతిక లోపంతో ఆ ప్రయోగం నిలిచిపోయింది. ఆ తర్వాత 2019లో మరోసారి చంద్రయాన్‌కు రాకెట్ సిద్ధమైంది. అయితే, విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్, ఆర్బిటార్‌తో వెళ్ళిన చంద్రయాన్ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుని ఉపరితలంపై భద్రంగా దిగలేకపోవడంతో ఆ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఈసారి చంద్రయాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ సఫలం కావాలనే గట్టి సంకల్పంతో శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమిస్తు న్నారు. చంద్రయాన్-2 ప్రయోగం విఫలం కావ డంతో నేర్చుకున్న పాఠాల నుంచి శాస్త్రవేత్తలు, ఈసారి రాకెట్ విజయవంతం చేయడానికి ప్రయో గంలో అవసరమైన మార్పులన్నీ చేస్తున్నారు. చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్‌ను జీఎస్ఎల్‌వి ఎంకె-3 రాకెట్ ద్వారా చందమామపైకి పంపించనున్నారు. చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ భద్రంగా దిగడా నికి పూర్తిస్థాయిలో పరిశీలనలు జరిపి, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగానికి కేంద్ర ప్రభుత్వం 650 కోట్ల రూపాయలను కేటాయిం చింది. చంద్రయాన్-3 విజయవంతమైతే భవిష్య తులో జాబిల్లి మీద పరిశోధనలకు మానవసహిత యాత్రలను నిర్వహించేందుకు కూడా ఈ ప్రయోగం ఎంతో కీలకంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.




లాయర్
జూన్ 30, 2023

# మోడీ పర్యటనలతో బంధాలు బలోపేతం

*'భారత్-అమెరికా స్నేహానికి ప్రపంచంలో అత్యధిక ప్రాముఖ్యత ఉంది. ఇరుదేశాల స్నేహబంధం గతంలో కంటే డైనమిక్‌గా, సన్నిహితంగా, బలంగా ఉండడం సంతోషకరం'*
- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.


*'భారత్-అమెరికా స్నేహంతో ప్రపంచానికి మేలు జరుగుతుంది. భూగోళం మనుగడకు కూడా ఇది దోహదం చేస్తుంది'...*
- భారత ప్రధాని మోడీ

నిజమే!.. అగ్రరాజ్యం అమెరికాతో మునుపెన్నడూ లేనంత స్నేహం ఇప్పుడు భారత్‌కు ఉంది. భారత్ అన్నా, ప్రధాని మోడీ అన్నా అమెరికాలో నాయకులతో పాటు, ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల ప్రజల్లో అభిమానం వెల్లువెత్తుతోంది. ఇప్పటికే ఆయా దేశాలతో మనకున్న బంధాలు, అనుబంధాలు మరింత ఆత్మీయంగా ముడివేసుకుంటున్నాయి. అందుకు ప్రధాని మోడీ విదేశీ పర్యటనలే ప్రధాన కారణం. ఆయన మాట, బాట ప్రపంచంలో ప్రతిచోటా కలకలం సృష్టిస్తున్నాయి. ప్రపంచవేదికపై భారత్ స్థాయి, పలుకుబడి బాగా పెరిగాయి.

అమెరికా, ఈజిప్టు దేశాల్లో ప్రధాని మోడీ ఇటీవలే ఆరు రోజులు పర్యటించి వచ్చారు. ప్రపంచంలోనే గొప్ప పాపులర్ నేతగా విశ్వవిఖ్యాతిని సాధించిన ప్రధాని మోడీని చూడడానికి అమెరికాలో ప్రజలు, ప్రవాసభారతీయులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వాషింగ్టన్‌లో ఉన్న శ్వేతసౌధం (వైట్‌హౌస్)లో అడుగిడి, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ ఆహ్వానం, అధ్యక్షుడు జోబైడెన్ దంపతుల స్వాగతసత్కారాల అనంతరం మోడీ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగానికి..ఆయన వాగ్ధాటికి అక్కడి నేతలు, ప్రజలు మంత్రముగ్ధులయ్యారు. 'సముద్రాల్లోని లోతుల్లోంచి ఆకాశమంత ఎత్తయిన బంధం దిశగా భారత్-అమెరికాలు భుజంభుజం కలిపి నడవబోతున్నాయని' మోడీ అన్నప్పుడు అక్కడివారంతా కరతాళధ్వనులు మార్మోగించారు. భూగోళంపై ఆరింట ఒకవంతు జనాభా భారత్‌లోనే ఉందని, భారతీయుల ప్రతిభ అపారమని, అమెరికాలోని ప్రతిరంగంలోనూ భారతీయు ముద్ర ఉందని అన్నారు. త్వరలోనే భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారబోతోందని మోడీ స్పష్టం చేశారు. ఆయన ప్రసంగిస్తుంటే అనేకసార్లు చప్పట్లు మార్మోగాయి. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' వంటి మోడీ నినాదాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించాయి. మోడీ తన పర్యటనలో కేవలం ప్రసంగాలే కాక, అనేకరంగాల్లో అత్యంత అవసరమైన అంశాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. రక్షణ రంగం, అంతరిక్షరంగం, శుద్ద ఇంధనం ఇలా పలు కీలక రంగాలపై అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో సుదీర్ఘంగా చర్చించి అనుకున్న లక్ష్యాలను సాధించుకు రావడం విశేషం.

ఈ చర్చల్లో అనేక రంగాల్లో ఎన్నో ఒప్పందాలు కుదరడం, ఇరుదేశాల సహకారానికి బాటలు పడడం విశేషం. రక్షణ రంగంలో అత్యంత కీలకమైన ఫైటర్ జెట్ ఇంజన్ల తయారీలో జనరల్ ఎలక్ట్రిక్ సాంకేతికతను బదిలీ చేసుకునేందుకు ఒప్పందం కుదరింది.భారీ పేలోడ్‌లను మోసుకుపోయే మానవరహిత డ్రోన్ల సరఫరా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో పాటు, ఇస్రో-నాసాల సంయుక్త ప్రాజెక్టులపై ఎంతో ముఖ్యమైన పరిశోధనలకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. చంద్రుడి మీదకు యాత్రకుకూడా నాసాతో భారత్ భాగస్వామి కావడం ఆనందదాయకం. హిందూ మహాసముద్రంతో పాటు, చైనాతో సరిహద్దులో భారత భద్రత, నిఘాసామర్థ్యం పెరిగేందుకు, సాయుధ డ్రోన్లను కొనుగోలు చేసుకునేందుకు మార్గం సుగమమైంది. ఈ పర్యటనలతో, భారత్‌లో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడతామంటూ అమెజాన్, గూగుల్ వంటి ప్రపంచప్రఖ్యాత దిగ్గజ సంస్థలవారు కూడా ముందుకురావడం విశేషం. ఇంతగా అమెరికాతో బంధం ఏర్పడడం అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాల చరిత్రలోనే ఇదే తొలిసారి. అంతేకాదు, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో ప్రధాని మోడీ పాల్గొని యోగాసనాలు వేయడం, ప్రపంచానికి భారతీయ యోగా ఒక వరమని చెప్పడం ప్రపంచప్రజలను బాగా ఆకట్టుకుంది. అదేవిధంగా ఈజిప్టు పర్యటన కూడా జయప్రదమైంది. దాదాపు పాతికేళ్ళ తర్వాత తమ దేశానికి వచ్చిన భారత ప్రధానికి ఆ దేశం నుంచి కూడా ఘనంగా స్వాగతం లభించింది. ఉభయదేశాల సాన్నిహిత్యం, సహకారం మరింత బలోపేతమయ్యాయి. ఈజిప్టుతో వాణిజ్యబంధంతో పాటు స్నేహపూర్వక సంబంధాలు బాగా పెంపొందేలా ప్రధాని మోడీ అమెరికా-ఈజిప్టు పర్యటనలు దిగ్విజయం కావడం హర్షదాయకం!...

## కాలమంతా..మారిపొయ్యిందబ్బయ్యా!



ఒరే అబ్బయ్యా...ఏందిరా తింటా ఉండావో!..మావిడికాయా ఏందా?...

ఆ!..మావిడికాయేలే మావా. అద్దో ఆ బుట్టలామె అమ్మతావుంటే సూసేదానికి బలే ఉండాయని కొన్నా!..

ఎంతంటరో?

వొందకి రొండంట. రసాలు గదా అని.. బాగుంటాయని కొన్నా. ఇద్దో ఇంకోటుంది. కావాలంటే తిను. మరీ ఇంత సప్పగా ఉండడం ఎప్పుడూ సూడలా మావా!..

అవున్రా..మావిడికాయలు తియ్యగుండాలంటే వోనలు పడాల గదా!..తోటల కాడ సెట్లన్నీ ఎండకి ఎండుకోనిబొయ్యుంటే వాటిల్లో రుసెక్కడుంటది. ఇంక మనకి సప్పిడికాయలే...ఏం సేద్దాం..కాలమెప్పుడో మారిపోయిందిరా అబ్బయ్యా!...

అట్టయితే..ఇంక వోనలు రావా మావా!...

వస్తాయిలేరా.. మొబ్బులు గమ్మునుంటాయా ఏందా?...

అట్టయితే.. ఎప్పుడొస్తాయి మావా?...

నేనేవన్నా సోదిసెప్పేవోణ్ణంటరా!.. వోనలెప్పుడొత్తాయో నాకెట్టా తెలుత్తాది. అయినా.. ఒరే అబ్బయ్యా!.. బలే అడిగినావు గానా.. నీకు బలే తమాసా కత సెప్తా ఇనుకో.

సెప్పు మావా!...




ఒకూళ్ళో అంటా..ఒక సోదిసెప్పేవోడుండాడంట. నీలాంటోడొకడు సేలో సెట్లేసుకోవడానికి వోనెప్పుడొసద్దోనని సోదోడుకాడకి బొయ్యి అడిగేడంట. సోమే సోమే.. ఈ యేడు వానలొత్తాయా.. అని సేతులు కట్టుకోని అడిగితే.. ఆ సోదోడుండి 'ఆ!..ముంచేస్తద్ది' అన్నాడంట. ఈడేమో..ఓర్నాయనో సెట్లేసుకుంటే మునిగిపోతామని సెట్లెయ్యలేదంట. ఆ ఏడేమో బలే వోన్లొచ్చినాయంట. వాడు ఆ సోదోడు దెగ్గిరికి బోయి, నువ్వేమో వోనలు రావంటివే సోమే..వోనలు బలే కురిసినాయే అన్నాడంట. ఆ సోదోడుండి..'ఒరే సన్నాసీ..వోనలొచ్చి నీళ్లల్లో ముంచొద్దిరా' అని కదా సెప్పేను అన్నాడంట. ఆ తర్వాత వీడికి తెగ అర్దమైపోయినట్లు తలూపి.. పోతే పోన్లే సోమీ.. ఈ ఏడన్నా కురస్తాయా..అనడిగితే, 'ఆ!..ముంచేస్తద్ది' అన్నాడంట. ఈ ఏడుకూడా బలే వానలొత్తాయని ఈడేమో సెట్లేశాడంట. ఆ ఏడు అసలు వోన బొట్టుకూడా పడకుండా సెట్లన్నీ ఎండిపోనాయంట. ఈడు మళ్ళీ లబోదిబోమంటూ ఆడికాడికెళ్ళి.. ఏంది సోమే..వోనలు బలే ముంచేత్తాయంటివే.. వొక్క బొట్టు కూడా రాల్లేదే అన్నాడంట. 'ఓరి సన్నాసీ..వోనలు రాకుండా నిన్ను ముంచేస్తాయని కదా నేను సెప్పింది'..అన్నాడంట సోదోడు. దాంతో, ఆమాయిన ఈడికి కల్లుతిరిగిపోయి అణ్ణే కూలబడ్డాడంట!...అట్లా ఉందిరా నీ యవ్వారం అబ్బయ్యా!...

బలే కత సెప్పినావు మావా..బాగానే ఉంది గానా..అసలింక మనూళ్ళో వోనలు బడవంటావా?..

ఈడే గాదురా అబ్బయ్యా!..ఈ సుట్టుపక్కల ఏవూళ్ళో కూడా పడవు. పడవంటే పడవు. ఎందుకని పడాల?.. సెట్లన్నిటినీ అడ్డదిడ్డంగా నరికిపారేత్తిరి. సముద్రాల కాడ కూడా ఈతసెట్లు, తాటిసెట్లు, మడసెట్లు..ఒక్కటన్నా ఉండాయా..అన్నిటినీ నరికి ముక్కలు సేసేత్తిరి. దాంతో సెగ ఇపరీతంగా తగలతా ఉండే..! యాడ సూపినా గాలంతా, నీళ్ళంతా గబ్బుగబ్బుగా ఉండే. అంతా కాలుస్యమే గదా!... అయినా.. సల్లంగా ఉంటే గదా.. వాన బడేది!.. అందుకే ఎండాకాలం మండిపోతా వుండాది. వోనాకాలం కూడా వోనల్లేక కాలతానే ఉండాది. సల్లటేల కూడా సెగ పుడతా వుండాది. మునుపట్లా కాదు.. ఇప్పుడు వోనలు గీనలన్నీ వాటిస్టమొచ్చినట్లు వొత్తుంటాయి పోతంటాయి. ఒక లెక్కా లేదు, జమా లేదు. నాట్లేసుకుందామనుకుంటే సుక్క నీళ్ళుండవు. పంట బలే వొచ్చిందనుకొంటే... పుసిక్కున వోనొచ్చేసి సేలన్నిటినీ ముంచిపారేత్తుండే! లేదంటే ఎంతకాలం సూసినా వోనన్నదే రాకపాయే! మద్దిలో రైతులు సావలేక బతకలేక సత్తా ఉండారు. కాలం పూర్తిగా మారిపోయిందిరా అబ్బయ్యా!.. ఏంజేద్దాం.. మనకర్మ అట్లా రాసుండాది. అంతా చేజేతులా మనం జేసుకున్న కర్మే గదో ఇదంతా!.. సెట్లు సేమలన్నీ బాగుండాలని అనుకుంటే గదా.. వోనాలొచ్చేది. సెట్లు నరకడమే గానీ... ఎవురు పెంచుతుండారు? అందుకే ఇట్టాగైంది! అదబ్బయ్యా! ఇదీ మందల!...

- సదువుకోని సుబ్బయ్య

### చెత్తకుప్పల నిలయంగా..
## జనార్ధన్‌రెడ్డి కాలనీ

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో ఉన్న జనార్ధన్‌రెడ్డి కాలనీలో పరిశుభ్రత కరువైంది. ఎక్కడ చూసినా మురుగుమడుగులు, చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కాలనీలో మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో సైడుకాలువలు మురుగుతో పేరుకుపోయి గబ్బుకొట్టిపోతున్నాయి. సందుగొందుల్లో ఎక్కడ చూసినా మురుగే. పారిశుద్యం పరిస్థితి ఘోరంగా ఉంది. కార్పొరేషన్ అధికారులు ఒకసారి ఈ కాలనీని సందర్శించి బాగు చేయించాలని విన్నపం.

– కె.ధనుంజయ, నెల్లూరు.

## 'లాయర్' కథనం బాగుంది

జూన్ 23 'లాయర్' సంచికలో మొదటిపేజీలో ఉన్న 'షర్మి'..ఇలా...'అనే కథనం బాగుంది. రానురాను రాజకీయాల్లో విలువలు నశించిపోతున్నాయి. పార్టీల్లో చేరడానికి ఎవరి స్వతంత్రం వారికుంటుంది. కానీ, మహానేత వైఎస్ బిడ్డగా ఇప్పుడు నాయకురాలి స్థాయికి ఎదిగిన షర్మిలమ్మే, రాష్ట్రాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పంచన చేరాలనుకోవడం దురదృష్టకరం. అందులోనూ మహానేత వైఎస్ కుటుంబాన్ని అష్టకష్టాలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించిన పార్టీలో షర్మిలమ్మ చేరడం ఎంతవరకు సబబో ఆమే నిర్ణయించుకోవాలి. ఏదేమైనా రాజకీయాల్లో నైతిక విలువలు దిగజారిపోతున్నాయి. 'లాయర్' రాసినట్లుగా, నేటి కాలంలో నేతలకు పదవులే పరమావధిగా మారుతున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## కాలేజీలకు పాఠ్యపుస్తకాలేవీ?

పాఠశాలలు పున:ప్రారంభించినా జిల్లాలో ఇంకా అనేక ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు పాఠ్యపుస్తకాలు రాలేదు. రోజులు జరిగిపోతుంటే సిలబస్ ఎలా పూర్తవ్వాలి. అదేమని అడిగితే పుస్తకాల షాపులకెళ్ళి కొనుక్కోండి అంటున్నారు కళాశాలల నిర్వాహకులు. ప్రభుత్వం లేదా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులైనా పట్టించుకోకపోతే ఎలా?..

ఆర్.జానకీదేవి, నెల్లూరు.

## కనిపించని 'హెచ్చరిక' బోర్డులు

ఈ వేసవిలో ఈత సరదాతో పిల్లలు, యువకులు కాలువలు, నదులు, బావులు, చెరువుల దగ్గరకు వెళ్తున్నారు. యాత్రికులు ఎక్కువగా సముద్రతీరాలకు పోతున్నారు. ఎక్కడ సుడిగుండాలున్నాయో, ఎక్కడ గుంతలు తవ్వివున్నారో ఎవరికైనా ఎలా తెలుస్తుంది?.. ఈతకు దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోయి చనిపోతున్న ఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువవుతున్నాయి. జిల్లాలోని ప్రమాద ప్రాంతాల్లో ఈతకు దిగవద్దని 'హెచ్చరిక' చేస్తూ బోర్డులు పెట్టాలని ఉన్నతాధికారులు పదేపదే చెప్తున్నా అనేకచోట్ల అవి కనిపించడం లేదు. ప్రాణాలు పోగొట్టుకున్నాక ఎంత బాధపడి ప్రయోజనం ఏముంటుంది?..ఆయా గ్రామాల్లో సిబ్బంది, లేదా పోలీసులు కాస్త శ్రద్ధ తీసుకుని గ్రామస్తులచే ప్రమాదప్రాంతాలను గుర్తించి ఆ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

పి. సీతారామయ్య, కలిగిరి.

## నందవరం రోడ్డు బాగయ్యేదెప్పుడు?

ఉదయగిరి–నందవరం రోడ్డు పరమ అధ్వాన్నగా తయారైంది. చిన్న వానొచ్చినా చాలు, రోడ్డు పక్కలంతా గుంతలు పడిపోయి, వాహనాల రోకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎంతోకాలం నుంచి ఈ రోడ్డును బాగుచేసి డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరు కుంటున్నా జరగడం లేదు. నాయకులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం. జిల్లా ఉన్నతాధికారులైనా దయతలచి ఈ రోడ్డును పరిశీలించి సుమారు 30 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని బాగుచేసి పుణ్యం కట్టుకుంటారని ఆశిస్తున్నా.

కెవిఎస్ దయానిధి, ఉదయగిరి.

# నగరంలో సమస్యలపై దృష్టి సారించండి



నెల్లూరు నగరంలో పలు సమస్యల నివారణపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. ఈనెల 24న కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నల్స్ ఏర్పాటు, హైమాస్ట్ లైట్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విఆర్‌సి కూడలిలో లైటింగ్‌ను మెరుగుపరచాలని, జిల్లా ఎస్పీ ఆఫీసు నుంచి డైకస్ రోడ్డు వరకు తాత్కాలికంగా డివైడర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మత్తులు చేయాలన్నారు. నగరంలో ప్రైవేటు బస్సులు ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ ఆపుతున్నారని, అలా కాకుండా స్టాపింగ్ పాయింట్లను గుర్తించి, అక్కడే వాటిని నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సంగం నుంచి ఆత్మకూరు వెళ్లే మార్గంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్లు, లైట్లు తప్పనిసరిగా అందించాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు శాశ్వతంగా హోర్డింగులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. యువత వేగంగా వాహనాలు నడపకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారిపై కూడళ్లను పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులపై తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## 2286 కేసుల నమోదు - డీటీసీ చందర్

రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్నందుకు (డ్రంక్ అండ్ డ్రైవ్) జిల్లాలో 2023 జనవరి నుంచి మే వరకు 2286 కేసులు నమోదు చేశామని తెలియజేశారు. నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు 105 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి సహాయ సహకారాలు అందించి కాపాడిన వారికి ప్రోత్సాహకంగా గుడ్ సమారిటరన్ అవార్డు కింద రూ.5000 నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చందర్ చెప్పారు. మనుబోలు లోని జాతీయ రహదారి పెట్రోల్ బంకు వద్ద లైటింగ్‌ను మెరుగుపరచాలని ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి నేషనల్ హైవే అధికారులకు సూచించారు. సుమారు పది నుంచి 20 మంది ప్రయాణికులను ఆటోల్లో తీసుకెళ్తున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించి, అధికలోడ్‌తో ప్రయాణించకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో అన్నీ అనర్థాలే

## • శ్రీసిటీలో అవగాహన సదస్సు




మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై శ్రీసిటీలోని పరిశ్రమల ఉద్యోగులు, సాధారణ ప్రజలలో అవగాహన పెంపొందించడానికి ఈనెల 26న అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ, సమాజంపై, ఆరోగ్యంపై మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. సదస్సులో పాల్గొన్న వారి చేత మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఇసుజు వైస్ ప్రెసి డెంట్ సెంథిల్, హెచ్‌ఆర్ హెడ్ ప్రదీప్, విదేశాంగ వ్యవహారాలు హెడ్ కె.వేణు గోపాల్, అడ్మిన్ హెడ్ మురళి, ఇసుజు ఉద్యోగులతో పాటు శ్రీసిటీ ఎస్సై అరుణ్ కుమార్, శ్రీసిటీ పోలీసులు, సెక్యూరిటీ హెడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పథకాల పట్ల ప్రజల్లో సంతోషం

## నేదురుమల్లి రామ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే అర్హులైనవారు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈనెల 26న ఆయన రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, జగనన్న పథకాలు అందరికీ అందుతున్నాయంటూ ప్రజలు సంతోషిస్తున్నారన్నారు. సీఎంకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని, ఎవరెన్ని ఆరోపణలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు.

## తెలుగు భాషను

# పరిరక్షించుకోవాలి

### ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో నందమూరి లక్ష్మీపార్వతి



తెలుగు భాష ఎంతో విశిష్టమైనదని, మన తెలుగును మనం పరిరక్షించుకుంటూ తెలుగుభాషలోని గొప్పదనాన్ని దశదిశలా చాటాలని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చెప్పారు. ఈనెల 27న ఆమె నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, అందుకోసం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతో కృషిచేశారని, ఈ కేంద్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, ఆ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఆమె ఈ నెల 26న నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని సందర్శించుకున్నారు.

## రాష్ట్ర ప్రజలంతా బాగుండాలన్నదే..

# సీఎం జగన్ ధ్యేయం

## - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



రాష్ట్ర ప్రజలంతా బాగుండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అందుకే పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమపథకాలు అందిస్తూ, వారి జీవితాలకు బంగారుబాటలు వేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 24న ఆయన కోవూరు నియోజకవర్గంలోని విడవలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే తాను నియోజకవర్గంలోని 69 సచివాలయాల పరిధిలో 80,613 గడపలు తిరిగి ప్రజలను కలుసుకున్నానని, ఎక్కడకు వెళ్ళినా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాల పట్ల, రాష్ట్ర పాలన పట్ల ప్రజల్లో ఆదరణ వెల్లువెత్తుతోందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పురమాయించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ శ్యామ్‌సుందరరాజు, ఎంపీడీఓ శ్రీనివాసులు, జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, ఎంపీపీ భావనమ్మ, మాజీ ఏఎంసీ పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చింగారి తిరుపతయ్య, వైకాపా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, రాహిన్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు

## రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మెన్



బాలల హక్కులను కాలరాస్తూ, వారిని పనిలో పెట్టుకుని, వారిచే చాకిరీ చేయించుకుంటే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మెన్ కె.అప్పారావు హెచ్చరించారు. ఈనెల 24న ఆయన నగరంలోని డిఇఓ కార్యాలయంలో 'బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ'పై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, అందుకు అధికారులంతా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ఈనెలలోనే 23 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్పించాలే తప్ప పనిలో పెట్టుకోకూడదని, బాలలంతా బాగా చదువుకునేందుకు అందరూ ప్రోత్సాహం ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని అనేక సంస్థలు, హోటళ్లు, పరిశ్రమలు, ఇతర వ్యాపారసంస్థల్లో ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే ఆయా యాజమాన్యాలపై వెంటనే కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. బాలల అక్రమరవాణా, మాదకద్రవ్యాల వినియోగంపై జిల్లా పోలీసు అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, ఛైల్డ్ వెల్ఫేర్‌కమిటీ ఛైర్మెన్ మాధవి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, బాలల సంరక్షణాధికారి సురేష్‌తో పాటు పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### నలుగురు బాలకార్మికుల గుర్తింపు :

నెల్లూరు, ఆత్మకూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో ఈనెల 24న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి పలు దుకాణాల్లో పనిచేస్తున్న నలుగురు బాలలను గుర్తించారు. సంబంధిత దుకాణాల యజమానులపై ఛైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ తనిఖీల్లో సహాయ కార్మిక కమిషనర్ షేక్ గౌస్, కార్మికశాఖ అధికారులు కాకర్ల రామారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసనాయుడు, కావలి సహాయ కార్మిక అధికారి ఎన్.హరిబాబు, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## మత్తుకు చిత్తు కావద్దు

**- జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి**



మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు ఎవరూ బానిసలు కావద్దని, ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆ మత్తులో పడి చిత్తుకాకుండా, జీవితాలు నాశనం కాకుండా, వాటికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి హితవు చెప్పారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో పెద్దఎత్తున నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని, మాదకద్రవ్యాలు ఎవరూ వాడకూడదంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వాటిని కలిగివున్నా, కొన్నా-అమ్మినా, వినియోగించినా 10 నుంచి 20 ఏళ్ల వరకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ ర్యాలీలో ఏఎస్పీ హిమవతి, డిఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, అబ్దుల్ సుబాన్, గాంధీ, సెబ్ ఐఎస్ రవికుమార్, ఏఇఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సహకారబ్యాంకు సిఇఓకు సన్మానం



నెల్లూరుజిల్లా కేంద్ర సహకారబ్యాంక్ (ఎన్‌డిసిసిబి) సిఇఓ డాక్టర్ శంకర్‌బాబును ఆ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు ఈనెల 27న అభినందించి శాలువతో సన్మానించారు. బ్యాంకు సి-గ్రేడ్ నుంచి బి-గ్రేడ్‌కు ఎదగడం, బ్యాంకు వ్యాపార లావాదేవీలు 1500 కోట్ల దాకా ఎదిగిన నేపథ్యంలో వారు ఈ సన్మానం నిర్వహించారు. బ్యాంకు మరింత వృద్ధి సాధించి ఏ-గ్రేడ్‌కు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

## వీఎస్‌యులో మెగా ప్లాంటేషన్




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యు)లో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ముత్తుకూరులోని ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ వారు మెగా ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టారు. వీఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం.సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడానికి ముందుకు వచ్చిన ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సిఇఓ రాఘవ్ త్రివేదికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అయిదేళ్లలో వీఎస్‌యు హరిత విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందడానికి ఈ మెగా ప్లాంటేషన్ దోహదం చేస్తుందన్నారు. అందుకు తమ విశ్వవిద్యాలయం తరఫున సహకారం అందిస్తున్న ఎన్ఎస్ఎస్ విభాగాన్ని కూడా ఆమె అభినందించారు. ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు రెడ్డెయ్య, శ్రీధర్, వీఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయ ఆనందకుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ఉదయ్‌శంకర్, డా. ఉస్సేనయ్య, డా. కె.విద్యాప్రభాకర్, డా. వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జులై 2న ఫ్యాప్టో సదస్సు

వైకాపా అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు గడుస్తున్నా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించేందుకు జులై 2న నెల్లూరు టౌన్‌హాలులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరుగుతుందని ఆ సంఘం ఛైర్మన్ ఏ.సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్‌లు తెలిపారు. ఈనెల 27న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఫ్యాప్టో చేపట్టిన ఈ సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

## రాష్ట్రంలో వైకాపా దోపిడీ పాలన

**మండిపడ్డ ఆనం రామనారాయణ**



రాష్ట్రంలో వైకాపా అనైతిక పాలనకు, దోపిడీకి పాల్పడుతోందని, వ్యవస్థలను సర్వనాశనం చేస్తోందని మాజీ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి మండిపడ్డారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, వైకాపా పాలన తీరుపై, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనపై విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారని, ఇసుక-మట్టి-మద్యం మాఫియాలకు నిలయంగా రాష్ట్రాన్ని మార్చేశారని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరి, ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చాక అరాచకాలకు పాల్పడుతున్నారని నిందించారు. టిడిపి యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందన చూసిన తర్వాత వైకాపా నాయకులకు ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. యువగళం పాదయాత్ర ఉప్పెనలో వైకాపా కొట్టుకుపోక తప్పదని ఆయన అన్నారు. ఎన్టీఆర్ హయాంలో మొదటిసారిగా తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, నెల్లూరు నుంచి పోటీచేసి గెలుపొందానని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదేశిస్తే ఏ నియోజకవర్గంనుంచైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాజకీయాల నుంచి విరమించే ముందు, ఒకసారి నెల్లూరు నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలవాలని అనుకుంటున్నానని ఆయన తన మనోగతాన్ని వెల్లడించారు.

## విద్యుత్‌చార్జీల పెంపు దారుణం

**డిసిసి నేత చేవూరు ధ్వజం**




రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను భారీగా పెంచి ప్రజలపై పెనుభారం మోపడం దారుణమని, ఉచిత హామీల రూపంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారిలో రాష్ట్ర ఖజానాను నింపుకునేందుకు ప్రయత్నిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి విద్యుత్‌చార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. చార్జీలు తగ్గించకుంటే ఉద్యమం సాగిస్తామన్నారు. అనంతరం స్థానిక కపాడిపాళెం నుంచి, జెండావీధి నుంచి పలువురు కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నాయకులు ఉడతా వెంకట్రావుయాదవ్, షేక్.ఫయాజ్, చింతాల వెంకట్రావు, దుద్దుకూరు రమేష్‌నాయుడు, ఏటూరు శ్రీనివాసులు రెడ్డి, కొండా అనిల్‌కుమార్, పప్పర్తి గణేష్‌బాబు, మహిళా అధ్యక్షురాలు అన్నం లత, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

తమిళనాడులోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం నెల్లూరు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. జులై 2వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటుచేశామని, చార్జీ 1200 రూపాయలని, భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ డిఎం మురళీకృష్ణ తెలిపారు.

## తల్లితండ్రుల కమిటీ సమావేశం



నెల్లూరులోని కొండాయపాళెంలో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులకు ప్రభుత్వం అందజేస్తున్న పలు పథకాల పట్ల అవగాహన కల్పించారు. తల్లితండ్రుల కమిటీ ఛైర్మన్ ఎస్.సుప్రియ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాల నుండి విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన పలు పథకాలు 'మన బడి' నాడు నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లీష్ మీడియం బోధన, ఉయ్ లవ్ రీడింగ్ తదితర కార్యక్రమాల గురించి వారికి వివరించారు. ఉపాధ్యాయులు హరీష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 61వ భాగం

**ఖాం**డవరణ్య దహనం అయిపోగానే, కృష్ణార్జునులిద్దరు మాయాసురునితో కలిసి ఇంద్రప్రస్థము వెళ్ళిపోతారు. ఒకనాడు మయాసురుడు అర్జునునితో తనకు చేసిన ఉపకారానికి ఏదయినా కోరుకోమన్నప్పుడు, శ్రీకృష్ణుడు ఒక దివ్య మందిరాన్ని ధర్మరాజు కొరకు నిర్మించమంటాడు. మయాసురుడు ఎంతో సంతోషించి, ఉత్తర దిశగా మైనాక పర్వతం చేరుకుంటాడు. పూర్వం వృషభ డనే రాక్షసరాజు తన మందిరం కోసం బిందు సరోవరంలో దాచుకున్న గృహ సామాగ్రిని మయాసురుడు తీసుకుని, ఒక అత్యద్భుత దివ్య మందిరాన్ని నిర్మించి, బలవంతులయిన పదివేల రాక్షసులచే మోయించి ఇంద్రప్రస్థ నగరానికి తీసుకువచ్చి




ధర్మరాజుకి బహూకరిస్తాడు. అలాగే భీమునికి ఒక గదను, అర్జునునికి ఒక శంఖాన్ని ఇస్తాడు, ఆ దివ్య మందిరాన్ని చూసి అందరు ఆశ్చర్యంతో ఆనందిస్తారు. ధర్మరాజు మాయాసురుణ్ణి కృతజ్ఞతతో ఆదరిస్తాడు.

ధర్మరాజు తమ్ముళ్ళతో, దివ్య మునీశ్వరులతో అట్టహాసంగా ఆ సభా మందిరంలోకి గృహప్రవేశం చేస్తాడు. కొలువై ఉన్న ధర్మరాజును మునీశ్వరులు వేదోక్త ఆశీర్వచనాలతో అనుగ్రహించారు.

ఒకరోజు నారద మునీంద్రుడు అమర దేవతలు, దివ్య మునీంద్రులతో భూలోకం వచ్చి ధర్మరాజుని కలుస్తాడు. ధర్మరాజు తమ్ముళ్ళతో ఎదురేగి, నారద మునీంద్రుని గౌరవంగా తోడ్కొని వచ్చి సముచిత ఆదారామంతో పూజిస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**



# ఎన్నికలయ్యాక.. టీడీపీ కనుమరుగే!

## నెల్లూరు ఎంపీ ఆదాల



రానున్న ఎన్నికల తర్వాత తెలుగు దేశం పార్టీ కనుమరుగవుతుందని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న 27వ డివిజన్లో రోడ్లు, డ్రైన్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఎన్నోరకాల సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారని, అయితే తెలుగుదేశం పార్టీవారు వాటిని గురించి మాట్లాడకుండా రాష్ట్రంలో అభివృద్ధి ఆగి పోయిందంటూ లేనిపోని అసత్య ప్రచా రాలు చేస్తున్నారని, అందుకు కొన్ని పత్రి కలు కూడా వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ఒకపక్క సంక్షేమాన్ని విమర్శించే తెలుగుదేశం పార్టీ, తాము అధికారంలోకి వస్తే అంతకుమించిన సంక్షేమ పథకాలను చేపడతామని మేనిఫె స్టోలో చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఎవరెన్ని పాదయాత్రలు చేసినా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని జయించలేరని లోకేష్ పాదయాత్రనుద్దేశించి అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని 27 డివిజన్‌లో అభివృద్ధి పనులకు కోటీ 20 లక్షల రూపా యల నిధిని మంజూరు చేశామని, ఇప్పటికే అక్కడ 40లక్షల రూపాయల పనులు పూర్త య్యాయని చెప్పారు. స్థానిక నాయకులు వెంకటసుబ్బారెడ్డి, పెంచల్‌రెడ్డి ఈ కార్యక్ర మాన్ని నిర్వహించగా, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు నూనె మల్లికార్జునయాదవ్, మోబీనా, నాయకులు రాజేష్, రియాజ్, హరిబాబు యాదవ్, శివసునీల్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, జీవన్‌ప్రసాద్, ఎం.రామిరెడ్డి, జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, వైసిపి సేవాదళ్ అధ్యక్షుడు మాలెం సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



## జొన్నవాడ కామాక్షమ్మ సన్నిధిలో..

# వైభవంగా మండల హోమం

## పాల్గొన్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో కొలువైవున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈనెల 24న మండల హోమం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి నేతృత్వంలో, ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు జరిగి మండలం రోజులు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిం చారు. రాజ్యసభ సభ్యులు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు హైదరాబాద్‌కి చెందిన దాతలు కొలను రాజారెడ్డి-పూజితమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. గోపూజ అనంతరం హోమం వద్ద పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని దాతలు వేదపండితుల ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా కొలను రాజారెడ్డి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నేతృత్వంలో జులై 19 నుంచి జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారికి కోటి కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# సింహపురికి సరికొత్త స్వర్ణాభరణం.. 'లలితా జ్యుయలర్స్'

## పట్టుదలకు ప్రతిరూపం కిరణ్ - వక్తల ప్రశంసలు



సింహపురి సీమకు సరికొత్త స్వర్ణా భరణంగా లలితా జ్యుయలర్స్ ప్రజల విశేష ఆదరణ పొందుతోంది. ఈనెల 24న నెల్లూరులోను, గూడూరు, సూళ్ళూరుపేటలోనూ కొత్త బంగారు షోరూమ్‌లను ఏర్పాటుచేసి వినియోగ దారులను ఆకట్టుకుంది.

లలితా జ్యుయలర్స్ అధినేత కిరణ్ కుమార్ స్వస్థలం నెల్లూరు కావడం, ఎంతో పట్టుదలతో ఆయన బంగారు వ్యాపారంలో చిన్నస్థాయి నుంచి కష్టపడి పనిచేసి, ఆ తర్వాత బంగారు ఆభరణాల వ్యాపారంలో దేశవ్యాప్త ఖ్యాతిని సంపాదించడం అపూర్వం. నిరంతర కష్టసాధనతో కిరణ్ దక్షిణభారతదేశంలోనే అగ్ర గామిగా పేరుతెచ్చుకున్న లలితా జ్యుయలర్స్‌ను స్థాపించి దేశ వ్యాప్తంగా విస్తరిస్తుండడం గర్వకారణమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న మినీబైపాస్‌రోడ్డులో లలితా జ్యువెలరీస్ 50వ షోరూమ్‌ను ఆ సంస్థ అధినేత ఎం.కిరణ్‌కుమార్, ఆయన కుమార్తెలు భక్తి కిరణ్, భవ్య కిరణ్ చేతులమీదుగా ప్రారంభించి బంగారు వ్యాపారంలో మరో మైలురాయిని అధిగమించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడుతూ, బంగారు ఆభరణాల విక్రయంలో పేరెన్నికగన్న లలితా జ్యువెలరీస్ షోరూమ్‌ను నెల్లూరులో కూడా ప్రారంభించడం సంతోషకరమన్నారు. లలితా జ్యువెలరీస్ అధినేత ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే అతి తక్కువ ధరకు తమ షోరూమ్‌లలో బంగారు, ఆభరణాలు లభిస్తాయని, బంగారు హారాలు, వంకీలు, వడ్డాణాలు, ఉంగరాలు, కమ్మలు వగైరాలన్నీ తమవద్ద అనేక రకాలున్నాయని, తనకెంతో ఇష్టమైన సింహపురి సీమ ప్రజలకు నాణ్యమైన ఆభరణాలు అందుబాటులోకి తేవడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. వెండి వస్తువులను కూడా మార్కెట్ ధరలకంటే తక్కువ ధరకే ఇస్తున్నామని, వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, మేయర్ స్రవంతి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## వారణాసిలో బీఎంఆర్

వ్యవసాయం, పశుసంవర్ధక, ఆహార ప్రాసెసింగ్ స్టాండింగ్ కమిటీ అధ్యయన సందర్శనలో భాగంగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు(బిఎంఆర్) వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వివిధ రంగాలలో చేపడుతున్న ఆధునిక పరిశోధనలపై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లతో ఆయన చర్చించారు.









# శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు, ట్రంకురోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా **గురుపూర్ణిమ మహోత్సవాలు**

**తేది. 03-07-2023 సోమవారము నుండి తేది. 10-07-2023 సోమవారము వరకు జరుగును.**

**కార్యక్రమ వివరములు:**

తేది. 03.7.2023 సోమవారము నుండి 09.7.2023 ఆదివారము వరకు ప్రతి రోజు ఉదయం 7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.200/- చెల్లించి పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీ బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుకుంటున్నాము.

**నగరోత్సవం:**

తేది.10-7-2023 సోమవారం సా॥ 6.00 గం॥లకు పుష్పాలంకరణలతో, మంగళవాయిద్యములతో, విద్యుత్‌దీప కాంతులతో, బాణాసంచా వేడుకలతో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం నుండి గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, ఏ.సి.సెంటర్, సంతపేట మండపము, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, వి.ఆర్.కాలేజ్ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మీదుగా తిరిగి శ్రీ షిర్డి సాయిబాబా మందిరమునకు చేరును.

ఇట్లు: కార్యవర్గం

**శ్రీ షిర్డి సాయిబాబా మందిరం**

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వినియోగదారుల శ్రేయస్సే ముఖ్యం

## - - లలితా జ్యూవెలరీ అధినేత ఎం.కిరణ్‌కుమార్ - -





ప్రతి వినియోగదారుడు కష్టపడి సంపాదించిన సొమ్మును మోసపోకుండా ఉండటం, బంగారు కొనుగోళ్లతో ఆనందంగా ఉండాలన్న ధ్యేయంతో గూడూరు, సూళ్లూరుపేటలలో లలితా జ్యూవెలరీ నూతన షోరూమ్‌లను ప్రారంభించినట్లు ఆ సంస్థల అధినేత ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆసుపత్రి రోడ్డు, సూళ్లూరుపేటలోని జిఎన్‌టి రోడ్డులో నూతన షోరూమ్‌లను జూన్ 24వ తేదీ స్థానిక ఎమ్మెల్యేలు వి.వరప్రసాదరావు, కిలివేటి సంజీవయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఇతర నేతలతో కలసి ప్రారంభించారు. కిరణ్‌కుమార్ కుమార్తెలు భక్తి కిరణ్, భవ్య కిరణ్‌లతో షోరూమ్‌లలో పూజలు చేయించారు. నెల్లూరులో పుట్టి పెరిగి కష్ట నష్టాలు ఎదుర్కొని ఎన్నో అనుభవాలు, పాఠాలు నేర్చుకుని ఈ ప్రాంతంలో షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి నియోజకవర్గంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రలో ఇటీవల పాల్గొన్న గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, తెదేపా నాయకులు గంగప్రసాద్, తానంకి నానాజీ, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కురుగొండ్ల రామకృష్ణ తదితరులు.



# ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

గూడూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చదువుతూ 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఇటీవల గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు. నెల్లూరు పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్‌రెడ్డి వారి తల్లి పేరున విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5,000, 2వ బహుమతిగా రూ.3,000, 3వ బహుమతిగా రూ.2000 వంతున నగదు బహుమతులను అందజేశారు. ఫస్ట్ క్లాస్ సాధించిన 30 మంది విద్యార్థులకు లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్ దాతృత్వంతో గోల్డ్ మెడల్స్‌తో పాటు వారికి కావలసిన నోట్‌పుస్తకాలను అందించారు. కళ్యాణ సాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు పంచాయతీరాజ్ ఇ.ఇ. గిరినాథ్, మల్లెమాల మురళిరెడ్డి, పంచాయతీరాజ్ డిఈఈలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, ఫిజికల్ డైరెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# మడమనూరులో రచ్చబండకు భూమిపూజ



మనుబోలు మండలంలోని మడమనూరు గ్రామంలో జూన్ 24వ తేదీ ఉదయం శ్రీ సేవానాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో రచ్చబండ నిర్మాణానికి భూమి పూజ శంకుస్థాపన జరిగింది. మనుబోలుకు చెందిన మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, శ్రీ సేవానాదం ట్రస్టు సభ్యులు గూడూరు వెంకటరమణ హోటల్ యాజమాన్యం జి.రాంప్రసాద్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సేవానాదం ట్రస్టు అధ్యక్షులు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, సభ్యులు పల్లంపర్తి మహేందర్‌రెడ్డి, కావేటి భార్గవ్, అడపాల ప్రేమ్‌కుమార్, నిరంజన్, శ్రీను, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, గిరి, సురేష్, చంద్ర, సుధాకర్, దినేష్, రాకేష్, ఆశిక్, మడమనూరు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగన్నాథ రథయాత్ర



గూడూరు పురవీధుల్లో 9వ జగన్నాథ రథయాత్రను ఇస్కాన్ సిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జూన్ 24న నిర్వహించారు. సొసైటీ ప్రాంతం నుంచి రథయాత్ర పట్టణంలోని పలు వీధుల గుండా డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్ వరకు వైభవంగా సాగింది. మహిళల కోలాటాలు, నృత్యాలు, మేళతాళాలు, పండరి భజనలతో హోరెత్తింది. పలు పాఠశాలల విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, శ్రీ లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శ్రీలక్ష్మి, పీఎం రావులు, నిర్వాహకులు సుకదేవస్వామి, వాసు ఘోష్‌దాస్, భానుప్రకాష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్లతో ఉచిత అర్జీలు



గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సుదూర ప్రాంతాల నుంచి వారి సమస్యల పరిష్కారానికి అర్జీదారులు గూడూరు ఆర్డీవో కార్యాలయానికి ఎంతో వ్యయప్రయాసలు పడుతూ వస్తుంటారు. ఇలాంటి సమయంలో వారి సమస్యలను ఆర్జీ రూపంలో రాసిచ్చే క్రమంలో నిరక్షరాస్యులైన అర్జీదారులు నగదు చెల్లించి స్థానికంగా అర్జీలు రాసేవారి దగ్గర అర్జీలు రాయించుకుంటున్నారు. అర్జీలు రాసే క్రమంలో అధిక మొత్తంలో వసూలు చేయడంపై ఆర్డీవో స్పందించి, ఉచితంగా అర్జీలు రాసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి వివిధ సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ప్రతి సోమవారం ఇక్కడ అర్జీలు రాసేందుకు విధులు నిర్వహించేలా కొనసాగిస్తామని ఆర్డీవో కిరణ్‌కుమార్ వెల్లడించారు.

# రైతన్నల కష్టాలను కళ్ళకు కట్టిన.. 'మట్టిబండి'

**భా**రతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం. నూటికి తొంబై శాతం వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగించేవారు. కాలం మారడంతో చదువులు, ఉద్యోగాలు, పరిశ్రమలు, వ్యాపారాలు వృద్ధి చెందడంతో వ్యవసాయం చేసేవారి సంఖ్య కొంత శాతం తగ్గింది. అయినా అన్ని వృత్తులలోకి నేటికీ వ్యవసాయానిదే ప్రథమ స్థానం.

అతివృష్టి, అనావృష్టి, ఖర్చులు ఎక్కువ, రాబడి తక్కువ, గిట్టుబాటు ధరల్లేకపోవడం, ప్రభుత్వాల ఉదాసీన ధోరణులు వ్యవసాయాన్ని అంటరాని వృత్తిగా మార్చేశాయి. డాక్టర్ తన కొడుకు డాక్టర్ కావాలనుకుంటాడు. వ్యాపారి తన కొడుకు వ్యాపారస్తుడు కావాలని కోరుకుంటాడు. రైతు మాత్రం తన కొడుకు రైతు కావాలని కోరుకోడు... ఇలా జరుగుతూపోతే, రైతు అనే వాడే లేకపోతే ఆరోజు పరిస్థితి ఏమిటి? అన్నది ఆందోళన కలిగించే విషయం.

డా. నాగభైరవ ఆదినారాయణ బహుముఖీనమైన ప్రతిభా పాండిత్యాలు గలిగిన సాహితీవేత్త. పుట్టుకతో ఆయన రైతు బిడ్డ. వ్యవసాయంతో ఆయనకున్న అనుబంధం విడదీయరానిది. మట్టితో ఆయనకున్న ఆ ఆత్మీయ అనుబంధమే ఈ 'మట్టి బండి' దీర్ఘకవితకు ప్రాణం పోసింది.

***చిక్కాలు కట్టకపోయినా***
***పక్క చేలల్లో***
***గడ్డిపరకలను కూడా***
***ముట్టేవికావు...***

అంటూ తన ఇంట పుట్టిన కోడెల్ని గురించి చెప్పుకున్నాడు కవి. ఇవి రైతుల నిజాయితీని, వారి సత్యమైన జీవనాన్ని తెలుపుతాయి. దీన్ని బట్టి రైతుల మనస్తత్వాలు మనకు బోధపడతాయి. ఎన్ని కష్టాలు, కడగండ్లు ఎదురయినా అధర్మ ప్రవర్తన వారిలో ఉండదని కవి నిశ్చితాభిప్రాయం.

***విత్తనాన్ని విత్తంగా మార్చగల సత్తా వున్న ఇంద్రజాలికుడు***
***కల్లంలో పనివాళ్లకు దానకర్ణుడు***
***అతిథులకు అన్నమయ్యేవాడు;***
***యాచకులకు కబళమయ్యేవాడు***
***కష్టానికి ఫలితం ఆశించడం తప్ప,***
***పరులను యాచించడం తెలియనివాడు.***

అంటారు కవి మరోచోట 'రైతు' గురించి. ఈ వాక్యాలు కవికి సేద్యం పట్ల ఎంత ప్రేమ, రైతుపట్ల ఎంత భక్తి, వ్యవ సాయం పట్ల ఎంత అభిమానం ఉన్నాయో తెలుపుతున్నాయి.






**మట్టిబండి**
రచయిత:
**డా॥ నాగభైరవ ఆదినారాయణ**
పేజీలు : 72 వెల. 100/-
ప్రతులకు: డా॥ నాగభైరవ ఆదినారాయణ
202, శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను,
రామయ్యనగర్, ఒంగోలు - 523 002.
చరవాణి : 9849799711

***'మూడు తరాల పాటు / ముప్పూటలా / బువ్వపెట్టి బతికించిన పొలంతో / బంధాలన్నింటినీ తెంపుకుంటూ అమ్మేశాను /***
***పండగలకు, పబ్బాలకు / అక్కరలకు, అవసరాలకు / పురుళ్లకు, పుట్టిన రోజులకు / అన్నింటికి, ఇంటికి / ఆసరాగా నిలబడ్డ / పొలాన్ని అమ్మేశాను /***
***తాత నుంచి అయ్యకు / అయ్య నుంచి నాకు / వారసత్వంగా వచ్చిన పొలాన్ని / నా బిడ్డలకు అందజేయకుండా / అనువంశిక నియమాన్ని అతిక్రమిస్తూ / అన్యాయంగా అమ్మేశాను'***

అంటారు కవి ఒక చోట. పై వాక్యాల్లో కవి ఆవేదన, భూమితో రైతుకున్న అనుబంధం, దాన్ని అమ్మేటప్పుడు రైతుపడే బాధ వర్ణనాతీతం. రైతుకు భూమే దేవత, సర్వస్వమూ. కానీ పరిస్థితుల ప్రాబల్యం అమ్మాల్సివస్తుంది. ఈ వాక్యాలు చదివిన పాఠకుడికి తప్పక కళ్లు చెమ్మగిల్లేలా చేస్తాయి. కవి కరుణరసం పోషించడంలో దిట్ట. 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అనే నానుడికి పైవాక్యాలు సోదాహరణలు.

మొత్తం మీద నేలతల్లిని కన్న తల్లిగా ఆరాధించే ఓ రైతుబిడ్డ ఆత్మ కథ 'మట్టిబండి'. మట్టితో రైతుకున్న అనుబంధాన్ని అద్వితీయంగా తెలిపే కావ్యం 'మట్టి బండి'. ఎడ్లతో రైతుకున్న మాలిమిని కరుణార్ద్రంగా తెలిపే కావ్యం 'మట్టిబండి'.

అస్తవ్యస్తంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని, రైతులు భూములు అమ్ముకోవడాన్ని కళ్లకు కట్టినట్లు చెప్తూ కళ్లమ్మట నీరొచ్చేలా చేసిన కవి ఆయన.

అంతే గాక రాబోయే ముప్పును గురించి ముందే హెచ్చరిస్తూ ప్రభుత్వాలకు, సకల మానవాళికి వ్యవ సాయాన్ని కాపాడుకోమని హెచ్చరికనందించారు కవి.

సహజసుందరమైన భాష, నిసర్గమనోహరమైన భావన, అందమైన అభివ్యక్తి, సుందరమైన ప్రాస, అనన్యసామాన్యమైన పదచిత్రాలతో, గొప్ప రసానుభూతి కలిగించే విధంగా ఆదినారాయణ 'మట్టి బండి' కావ్యం అందించి వ్యవసాయ రంగం మీద ప్రతిఒక్కరిలోనూ ఆలోచనలను రేకెత్తించారు. రైతన్నల కష్టాలను, కన్నీళ్ళను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి కర్షక కవి అనిపించుకున్నారు. ఆదినారాయణ ప్రతిభా పాటవాలు అభినందనీయం.



**డా. గంగిశెట్టి శివకుమార్**
94418 95343

కరెంట్ చార్జీల పెంపుపై..

# అఖిలపక్ష నాయకుల నిరసన



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన కరెంటు చార్జీలను నిరసిస్తూ జలదంకి మండలం లోని అఖిలపక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. ఈనెల 24న జలదంకిలోని కమ్యూనిస్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా వ్యవసాయ సంఘం ఉపాధ్యక్షుడు తాళ్ళూరు మాల్యాద్రి మాట్లాడుతూ కరెంటు చార్జీల పెంపు ప్రజలకు అదనపు భారంగా తయారైందని, కేంద్రప్రభుత్వ వత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల మోత మోగిస్తోందని విమర్శించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ప్రజలపై పన్నుల భారం పెరిగిందని, ఇప్పటికి 8 సార్లు ఆ పార్టీ కరెంటు చార్జీలు పెంచడం దారుణమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేలమూరు శివశేఖర్‌రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని, లేకుంటే ఉద్యమం తప్పదన్నారు. త్వరలోనే సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయానికి లక్ష విరాళం



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్ర మైన శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన భక్తుడు అవ్వారి దినేష్‌కుమార్, ఆయన కుటుంబసభ్యులు కలిసి ఈనెల 24న లక్షా 120 రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆలయ నిర్వాహకులకు వారు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు అమ్మవారి ప్రసాదాలను ఇచ్చి ఆశీస్సులు అందజేశారు.

## బతుకాక ఉత్సవం

సమస్యలకు
పరిష్కారాలుంటాయి
నదికి పాయలున్నట్లు.
పరిష్కారాల్లేని జీవన పోరాటాలు
ఎప్పుడూ ఉండవు
నీరు పల్లాల్లో ప్రవహించినట్లు.
అవి తేలిపోతాయి.
సమస్యలు వ్యవస్థీకృతమైతే
విజయ ప్రస్థానాలకు తావెక్కడిది
మేనేజ్‌మెంటు సిద్ధాంతమే
విఫలమయ్యేది కాదా!
కుటుంబంలో పొరపొచ్చాలు
సముద్రంలో అలల్లాంటివి.
కొన్నిసార్లు సుడిగుండాలవుతాయి
సూదిలో దారం ఎక్కించినట్లు
పొలంలో కలుపును ఏరేసినట్లు
తిరోగమనమైనా అప్రమత్తంగా
వ్యవహరిస్తే
ఓపిగ్గా ఎదురుచూస్తే
బాధలు దిగిపోవూ!
చీమకూ సమస్యలుంటాయి
కెరటానికీ సమస్య ఉంటుంది
అవి నిష్క్రియాపరత్వం
అలవరచుకోవు గదా!
అప్పులు కుప్పలైనాయనో
పరీక్షల్లో అగ్రస్థానం పొందలేదనో
ప్రేమైకనాదం విఫలమైందనో
చిన్న చిన్న వైఫల్యాలు
నదుల్లో నీటిబుడగల్లాంటివి
నిజానికి గ్రహణంతో సూర్యగోళం
సైతం మసకబారుతుంది కదా
చంద్రగోళానిది సైతం
అదే పరిస్థితి కాదా
అవి అశ్రువుల నేత్రాలతో
కూర్చుంటాయా
తెల్లారగానే ఇనబింబం
మరింత ఉద్విగ్నంగా కోటి
ప్రభలతో వెలిగిపోదా!
చిరుసమస్యల్నే లెక్కించి
అఖాతంలో ఇరుక్కొన్న
సముద్రమై వ్రేలాడితే
మనిషి ఎలా రాటుదేలాలి
గుండెల్లో తోటలెలా పూయాలి
ఏ రోడ్డూ సాఫీగా ఉండదు.
బ్రతుకు ప్రయాణం కూడా
అంతే కదా!
కలతల మేకులకు వెరవకూడదు
వెలిస్తే జీసెస్ సందేశం
ఏమైపోతుంది
క్లిష్టవాక్యాలకు వెరచి
తనువు చాలిస్తే
నమ్ముకొన్న వాళ్ళకు సరస్సు
కావాల్సిన వాడివి
కుటుంబాల్లో
ఆరని చిచ్చు రగులుస్తారా?
పెనుసవాళ్ళను స్వీకరించ్కోనా
సరే...
సమస్యల సమాధుల మీద నుంచి
ఛాతీలో దాక్కొన్న ఆత్మను
వెలికి తీసైనా సరే...
స్వప్నాల్ని సాకారం చేస్తేనే కదా
బతుకు ఒక ఉత్సవం అయ్యేది
ఊపిరి వేడుకగా పరిణమించేది
మనిషోక గవాక్షం అయి
సహస్ర బాహువులు చాచి
వసంతాల్ని ఆలింగనం చేసుకొనేది!



చిన్ని నారాయణరావు
94402 02942

వైకాపా ఆరాచక పాలనకు

# త్వరలోనే చరమగీతం

- టిడిపి నేత బొల్లినేని వెంకటరామారావు



రాష్ట్రంలో వైకాపా ఆరాచక పాలనకు త్వరలోనే చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. ఈనెల 24న వింజమూరులోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ పాలన రాక్షసంగా మారిందని, ప్రజలు వైకాపా తీరుపట్ల విసిగిపోయి, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండాలని, బాబు సారథ్యంలోనే మళ్ళీ తిరిగి రాష్ట్రం అభివృద్ధి దిశలో పురోగమిస్తుందని ప్రజలు విశ్వ సిస్తున్నారని అన్నారు. టిడిపి యువనాయకుడు లోకేష్ ఇటీవల నిర్వహించిన 'యువగళం' పాదయాత్రకు జిల్లాలో విశేష ఆదరణ లభించడం అందుకు నిదర్శనమని అన్నారు. టిడిపి శ్రేణులంతా గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జులై మొదటివారంలో ఉదయగిరి నియోజకవర్గంలో 'యువగళం' లోకేష్ పాదయాత్రకు సన్నాహాలు చేస్తున్నామని, ఆ యాత్రను ప్రజలు, కార్యకర్తలందరూ విజయవంతం చేయాలని కోరారు. మండల టిడిపి నాయకులు రఘునాథ్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, కోడూరు నాగిరెడ్డి, చల్లా శ్రీనివాసులుయాదవ్, నరసారెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# దొంగల ముఠాను పట్టుకున్నారు

### నెల్లూరు పోలీసులు శెభాష్ అన్పించుకున్నారు

### ముగ్గురు అరెస్ట్-రూ. 13.80 లక్షల సొత్తు స్వాధీనం



తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని, ప్రజల కంటికి కునుకులేకుండా చేస్తున్న దొంగలను ఎట్టకేలకు నెల్లూరుజిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అదేపనిగా దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి 13.80 లక్షల రూపాయల విలువచేసే సొత్తును కూడా స్వాధీనం చేసుకు న్నారు. జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులతో పాటు, ఆయా ప్రాంతాల ప్రజలు ఈ సందర్భంగా పోలీసులను అభినందిస్తున్నారు. ఈనెల 24న నెల్లూరులోని సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ఏ.శివాజీరాజు ఆ నేరస్తుల వివరాలను వెల్లడిం చారు. జిల్లాలోని ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ గుడ్డి గౌస్, నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ ప్రాంతానికి చెందిన ఎల్.రాంబాబు, ప్రకాశం జిల్లా మార్కాపురం నివాసి ఆర్.తిరుపతయ్యలు ముగ్గురూ పాత నేరస్తులు. జైల్లో ఉన్నప్పుడు వీరంతా స్నేహితులయ్యారు. విడుదలయ్యాక ముగ్గురూ ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. తాళం వేసిన ఇళ్ళను కనిపెట్టి దొంగ తనాలు చేసేవారు. జిల్లాలోని కొడవలూరు, నెల్లూరు రూరల్, కావలి రూరల్, మార్కాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి అందినకాడకి దోచుకున్నారు. జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి సూచనలతో నెల్లూరు సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజు, సిసిఎస్ -కావలి రూరల్ ఇన్స్‌పెక్టర్లు బి.రమేష్‌బాబు, ఎం.రాజేష్‌లు ఈనెల 24న కావలి సమీపంలోని ముసునూరు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నగదును, 35 సవర్ల బంగారు, 3 కేజీల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు.

## టూకీగా...

### జొన్నవాడలో..

### నిత్యాన్నదానానికి లక్ష విరాళం

దగదర్తి మండలం పెదపుత్తేడు గ్రామానికి చెందిన దివం గత తుంగా పాండురంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ ఇటీవల జిల్లాలో సుప్రసిద్ధమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఆ మొత్తాన్ని ఆమె ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

### గురివిందపూడిలో రెవిన్యూ సదస్సు

మనుబోలు మండలంలోని గురివిందపూడి గ్రామంలో ఇటీవల రెవిన్యూ సదస్సు జరిగింది. ఉప తహశీల్దార్ బాల కోటమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసంబంధిత సమస్యలేమైనా ఉంటే తమకు అర్జీలు ఇస్తే వెంటనే పరిశీలించి ఆ సమస్యలు తీరుస్తామని ఆమె చెప్పారు. ఆమెతో పాటు వీఆర్‌ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### పెంచలకోనలో.. వైభవంగా కల్యాణోత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచల కోనలో కొలువైవున్న చెంచులక్ష్మి-ఆదిలక్ష్మీ దేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఈనెల 24న వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారి మూలమూర్తిని శోభాయమానంగా అలంకరించి అభిషేకం చేశారు. గోపూజ అనంతరం కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### మాలకొండ ఆదాయం రూ. 13.7 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం లోని మాలకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈనెల 24 శనివారం ఒక్కరోజే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 13,70,801 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయ అధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.

### కోవూరులో మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన

కోవూరులో ఈనెల 24న సెబ్ సిఐ నరహరి ఆధ్వర్యంలో టిఎన్‌సి కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో, విద్యార్థులకు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాంటి వాటి జోలికి వెళ్తే జీవితాలు నాశనం అవుతాయని, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. సెబ్ ఎస్ఐ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సంగం సచివాలయాన్ని తనిఖీ చేసిన డిపిఓ

మండలకేంద్రమైన సంగంలో ఉన్న సచివాలయాన్ని ఈనెల 24న జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) సుస్మితారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలను ఏవిధంగా అమలుచేస్తున్నారో పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. జులై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించాలో వివరించారు.

### బోటికర్లపాడులో పోలేరమ్మ గుడికి బొల్లినేని విరాళం

దుత్తలూరు మండలం రెడ్డిదిన్నె పంచాయతీలోని బోటికర్లపాడు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ దేవాలయానికి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఈనెల 24న పాతికవేల రూపాయలు విరాళం అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, టిడిపి నాయకులు కె.ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### జొన్నవాడలో జగనన్న ఇళ్ళను పరిశీలించిన జేసీ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో జరుగుతున్న జగనన్న లేఅవుట్లను ఇళ్ల నిర్మాణాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఈనెల 24న పరిశీలించారు. రికార్డులు తనిఖీచేసి, ఆ ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాల న్నారు. ప్రభుత్వ పథకాలను సజావుగా ప్రజలకు అందించా లంటూ కాంట్రాక్టర్లకు, అధికారులకు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

# చంద్రబాబుకి చంద్రశేఖర్ బాసట!

(మొదటి పేజీ తరువాయి)

తరుణంలో చంద్రబాబు ఇక ఎప్పటికీ మాజీగా మిగిలిపోవలసిందేనని అప్పట్లో రాజకీయ వర్గాలు కామెంట్ చేశాయి కూడా. అంతేకాదు తెరాస పార్టీ సైతం తెరమరుగైపోయి తెలంగాణ ఉద్యమం అటకెక్కిపోతుందని కూడా మేధావులు భావించారు. కానీ, 2009 సెప్టెంబర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాద దుర్ఘటనలో సంభవించిన రాజశేఖరరెడ్డి మరణం... రెండు తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపినా, ఇటు చంద్రబాబు, అటు చంద్రశేఖర్‌ల రాజకీయ జీవితాలను మళ్ళీ చిగురింపచేసిందనడంలో మాత్రం సందేహం అవసరం లేదు.

రాష్ట్రం రెండు ముక్కలుగా విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి రాజశేఖరరెడ్డి మరణమే కారణం. ఆ ఒక్క కారణమే కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేసింది. చంద్రబాబు నాయుడు 2014లో మళ్ళీ అధికార పగ్గాలు చేపట్టి ముఖ్యమంత్రి కావడానికి రాష్ట్రం విడిపోవడం ప్రత్యక్ష కారణమైతే, అక్కడా మళ్ళీ పరోక్షంగా రాజశేఖరరెడ్డి మరణమే చంద్రబాబుకి కూడా కలిసొచ్చింది. అదే కేసీఆర్ ఆంధ్రా ప్రభుత్వ పనితీరుని కించపరుస్తూ అప్పుడప్పుడూ చేస్తున్న కామెంట్స్ చంద్రబాబుకి అనుకూలంగా మారే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. తాను మళ్ళీ అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో కల్వకుంట్ల మాట్లాడుతున్న మాటలు నారా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్లుగా ఉన్నా యన్నది వారి అభిప్రాయం.

మరో 5 నెలలలో తెలంగాణలో, 9 నెలలలో ఆంధ్రాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో తెలంగాణ నేతలు తరచూ తమ రాష్ట్రంతో ఆంధ్రాని పోల్చి మాట్లాడడం రెండు రాష్ట్రాల రాజకీయాలలో హాట్‌టాపిక్‌గా మారింది. తనను తాను గొప్పగా చెప్పు కునే క్రమంలో తనకు బద్ధశత్రువైన చంద్రబాబుకి చంద్రశేఖరరావు బలాన్ని చేకూరుస్తు న్నారు. ఓటుకి నోటు కేసులో బాబుని ఇరికించి ఆంధ్రాకి తరిమేసిన కేసీఆర్ ఇప్పుడు పరోక్షంగా అదే బాబుకి మంచి జరిగేలా మాట్లాడుతూ రాజకీయ చాణక్యతని ప్రదర్శి స్తున్నారు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో...

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ప్రధాన అతిథిగా హాజరై కరవాలం వద్దు.. కరచాలనం ముద్దు అని వ్యాఖ్యానించారు. విభజన సమస్యల పరిష్కారానికి రెండుసార్లు ఈ సీఎంలిద్దరూ సమావేశం అయ్యారు కూడా. కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆంధ్రా సీఎం జగన్ ముఖ్యఅతిథిగా వెళ్లారు. ఆ తర్వాత కృష్ణా నదీ జలాల కేటాయింపు వ్యవ హారంలో రెండు రాష్ట్రాల మధ్య స్వల్ప విబేధాలు కూడా తలెత్తాయి. కృష్ణా నదిపై ఏపీ సర్కారు అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తోందంటూ కేసీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇక శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల అంశమైతే పెద్ద దుమారమే రేపింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటిని విద్యుత్ అవసరాలకు వినియోగించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశిస్తే, రాయలసీమకు తాగు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం జగన్ పట్టు బట్టారు. దీంతో కేంద్రం జోక్యం చేసుకొని కృష్ణా – గోదావరి యాజమాన్య బోర్డులకు ఈ తగాదాను అప్పజెప్పింది. ఇరు ప్రభుత్వాలు పంతానికి పోయి చివరకు ఆ ప్రాజెక్టుపై పెత్తనాన్ని కేంద్రం చేతిలో పెట్టాయి. దీనికి పొడిగింపుగా ఎన్జీటీలో రాయలసీమ లిఫ్ట్ మీద తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరంపెడితే, పాలమూరు – రంగారెడ్డి లిఫ్ట్ మీద ఏపీ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తింది. ఫలితంగా ఈ రెండు ప్రాజెక్టుల పనులు ఆగిపోయాయి.

గత ఏడాది విభజన సమస్యలపై కేంద్రం నియమించిన త్రిసభ్య కమిటీ ఎదుట కూడా రెండు రాష్ట్రాల అధికారులు ఎవరి వాదన వారు వినిపించారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్ పేరుతో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా కేసీఆర్ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ముఖ్య నేతలను కలిశారు కానీ, పక్కనే ఉన్న ఏపీ సీఎం జగన్‌ను మాత్రం పలకరించలేదు. జగన్ ప్రభుత్వం కేంద్రం కనుసైగలతో పనిచేస్తుందన్నది కేసీఆర్ అభిప్రాయం. అందుకోసమే ఆయన జగన్‌కి దూరంగా ఉంటున్నారు. కేంద్రప్రభుత్వంతో కయ్యానికి కాలుదువ్వుతున్న కేసీఆర్‌కి దూరంగా ఉండడమే తనకి మంచిదనే ఉద్దేశ్యంతో జగన్ కూడా ఆయనని కలవడానికి అయిష్టత చూపిస్తున్నాడని వైసీపీ వర్గాలు అంటున్నాయి.

మరోవైపు షర్మిల తెలంగాణలో వైఎస్సార్‌టీపీ పేరుతో ఆ రాష్ట్రంలో పార్టీ పెట్టడం, చెల్లిని నియంత్రించడంలో జగన్ సుముఖత చూపించకపోవడం వంటి అంశాలు జగన్ – కేసీఆర్ మధ్య దూరాన్ని పెంచాయన్నది కూడా విశ్లేషకుల అభిప్రాయం. ఇటీవల పోలీసులతో విజయమ్మకి, షర్మిలకు జరిగిన గొడవల నేపథ్యంలో కూడా షర్మిలని, విజయమ్మని కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులుగానే చూశారు తప్ప, పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి తల్లి, చెల్లి అనే ప్రాధాన్యతని ఇవ్వకపోవడం కూడా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

జరిగిన, జరుగుతున్న పరిణామాలన్నీ గమనిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు ఆయన అనుచరగణం ఆంధ్రా ప్రభుత్వం మీద చేస్తున్న దుష్ప్రచారం చంద్రబాబుకి కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు పేర్కొనడం గమనార్హం....!

# కండలేరును సందర్శించిన చెన్నై ఇంజనీర్లు

తెలుగుగంగలో అంతర్భాగంగా నెల్లూరుజిల్లా రాపూరు నియోజకవర్గంలో ఉన్న కండలేరు జలాశయాన్ని, సత్యసాయి గంగ కాలువను చెన్నై ఇంజనీర్ల బృందం ఈనెల 27న సందర్శించింది. ఈ జలాశయం నుంచి వేసవిలో చెన్నైకి విడుదలవుతున్న తాగునీటి వివరాలను, గంగ కాలువల పరిస్థితిని ఇంజనీర్లు పరిశీలించారు. తమిళనాడు ఇంజనీర్లు ఎం.జైకర్ జేసుదాస్, టిఆర్ పార్థసారథి, కె. కళైసెల్వన్, పీడీ అజిత్‌కుమార్, తిలైకరోస్, ఎ.రాజసిద్ధన్, పి.ఫళనికుమార్, భరత్‌లతో పాటు జిల్లాలోని తెలుగుగంగ ఇంజనీర్లు కె.హరినారాయణరెడ్డి, పి.విజయకుమార్‌రెడ్డి, డి.రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసరావు, కె.తిరుమలయ్య, జి.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యువనేత లోకేష్ సభను జయప్రదం చేయండి

## జులై 1న.. ముత్తుకూరులో 'యువగళం' పాదయాత్ర - సోమిరెడ్డి పిలుపు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ యువ గళం పాదయాత్ర సర్వేపల్లి నియోజక వర్గంలోని మండలకేంద్రమైన ముత్తు కూరులో జరుగుతుందని, తెలుగుదేశం అభిమానులు, ప్రజలు, కార్య కర్తలందరూ పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆ సభను జయ ప్రదం చేయాలని మాజీమంత్రి, తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జులై 1వ తేదీ శనివారం సాయంత్రం 5గంటలకు ముత్తుకూరులో లోకేష్ పాద యాత్రతో పాటు భారీ బహిరంగ సభ కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వైకాపా పాలన అంతా అరాచకంగా, అవినీతిమయంగా ఉందని, అదేమని



అడిగితే అక్రమ కేసులు పెట్టి ప్రజలను, తెలుగుదేశం కార్యకర్తలను, నాయకులను వేధిస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంతా అస్తవ్య స్తంగా తయారైందని ఆయన ఈ సంద ర్భంగా ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని, వైకాపా పాలనలో రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు ఇలా అన్నిరంగాల వారు అభి వృద్ధికి నోచుకోక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన పేర్కొ న్నారు. రాష్ట్రం తిరిగి బాగుపడాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, చంద్ర బాబునాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి అయితే తప్ప ఈ రాష్ట్రానికి అభివృద్ధి ఉండదని అన్నారు. వైకాపా నిరంకుశ పాలన నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు, యువగళం పేరుతో లక్షలాది మంది ప్రజలను ఉత్తేజ పరుస్తూ లోకేష్ కదలివస్తున్నారని, సర్వేపల్లి నియోజక వర్గంలో జరిగే చరిత్రాత్మకమైన ఆ పాద యాత్రను అందరూ కలిసి దిగ్విజయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# టెక్నికల్ పరీక్షలు

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు-2023 సంవత్సరానికి సంబంధించి పరీక్షలు జులై 3 నుంచి 6వ తేది వరకు జరుగుతాయని, అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఆ తేదీల్లో జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును వెరిఫికేషన్ కోసం సమర్పించాలని తెలియజేశారు.

# శంకరమఠంలో.. చండీయాగం

నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధమైన శంకరమఠంలో ఉన్న శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో జులై 1వ తేది నుంచి వైభవంగా చండీయాగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, జులై 3వ తేదీ వరకు ఈ యాగం నిర్వహి స్తామని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాగంలో పాల్గొ నాలనుకునే భక్తులు 96528 60264 లేదా 99499 18358 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

## మనుబోలు పోలేరమ్మకు..

# మకరతోరణం



మనుబోలులోని గ్రామదేవత శ్రీ పోలే రమ్మ అమ్మవారికి మనుబోలుకు చెందిన భక్తులు పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, పచ్చిపాల కృష్ణారెడ్డి, వారి కుటుంబసభ్యులు ఈనెల 27న మకరతోరణాన్ని తమ వితరణగా సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సర్వేపల్లి ఫణీంద్రశర్మ వారికి అమ్మవారి వద్ద ప్రత్యేకపూజలు చేయించి ఆశీస్సులు అందజేశారు.

# ఎన్‌బికెఆర్ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాల విద్యార్థులు అమెరికాలో ఉన్నతవిద్యను అభ్యసిం చేందుకు అవకాశం కలుగుతోంది. అమెరికాలోని మసాచుసెట్స్ విశ్వవిద్యాలయంతో తమ కళాశాల ఆమేరకు త్వరలోనే అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుందని ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'అమెరికాలో ఉన్నతవిద్యకు గల అవకాశాలు' అనే అంశంపై మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్- డైరెక్టర్ డాక్టర్ విజయ చలివేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అయిదేళ్లలో జెఎన్‌టియు బీటెక్ డిగ్రీతో పాటు అమెరికాలోని మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్ డిగ్రీని పొందేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు 3వ సంవత్సరం బీటెక్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్‌కు కూడా రిజిస్టర్ చేసుకోవాలని, డిగ్రీ పూర్తయిన మరుసటి సంవత్సరంలోనే అమెరికాలో ఎంఎస్ డిగ్రీ చదవాల్సి ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌బికెఆర్ మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. అమెరికా యూనివర్శిటీలో కుదుర్చుకునే అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులు అనేక సువర్ణావకాశాలను పొందవచ్చని తెలియజేశారు.

# జిల్లాలో 16 మంది ఎస్ఐల బదిలీలు

జిల్లాలో 16 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఈనెల 28న ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఐలు ఎం.రాజకుమార్‌ను నెల్లూరు వేదాయపాలెం నుంచి ఇందుకూరుపేటకు, జి.అంకమ్మను నార్త్‌ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి వేదాయ పాలెంకు, ఎం.శివశంకరరావును ఆత్మకూరు నుంచి నార్త్ ట్రాఫిక్ స్టేషన్‌కు, కె.ముత్యాల రావును మనుబోలు నుంచి విఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా జి.అజయ్‌కుమార్‌ను వీఆర్ నుంచి మనుబోలుకు, ఎం.వెంకటరావును కావలి రూరల్ నుంచి సౌత్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.సుమన్‌ను దగదర్తి నుంచి కావలి రూరల్‌కు, డివిఎస్ విజయకుమార్‌ను దర్గామిట్ట నుంచి దగదర్తికి, ఎం.వి రమణయ్యను విఆర్ నుంచి కందుకూరు రూరల్‌కు, ఎం.శివనాంచారయ్యను కందుకూరు రూరల్ నుంచి నెల్లూరు చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌కు, సిహెచ్ ప్రభాకర్‌రావును వీఆర్ నుంచి సంతపేట స్టేషన్‌కు, సిహెచ్ వాసును సంతపేట నుంచి సైదాపురానికి, వి.మాల్యాద్రిని వీఆర్ నుంచి దిశ పోలీస్‌స్టేషన్‌కు, కె.శేఖర్‌బాబును దిశ స్టేషన్ నుంచి బిట్రగుంటకు, ఏ.ప్రభాకర్‌రావును చిన్నబజారు నుంచి పీసీఆర్‌కు బదిలీచేశారు. జె.మాల్యాద్రిని కావలి టూటౌన్ నుంచి వీఆర్‌కు పంపారు.

# బి.టెక్ విద్యార్థులకు జేవీవీ నోట్‌బుక్స్

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రొస్పరో స్కూల్ కరస్పాండెంట్ దశరధ రామిరెడ్డి దాతృత్వంతో స్థానిక డియస్ఆర్ కమ్యూనిటీ



హాల్ ప్రాంగణంలో ఈ నెల 29వతేదీ బి.టెక్ మరియు ఇంటర్ విద్యార్థులకు నోట్‌బుక్స్, క్యాలికులేటర్స్, పెన్నులను జేవీవీ సీనియర్ సభ్యులు వాకాటి రామమోహన్, పురుషోత్తమ రావు, నాగరాజుల చేతులమీదుగా పంపిణీ చేశారు. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్, రాధయ్య, కటకం శ్రీను, సాయికిరణ్, మురళీసింగ్, జగదీష్, ప్రసాద్, చిన్నయ్య, రమేష్, రవి, మస్తాన్, 'లాయర్' వారపత్రిక గూడూరు డివిజన్ ప్రతినిధి, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులు అనిమెళ్ళ శివకుమార్, రామమోహన్, పురుషోత్తమ రావు, నాగరాజు, వేగూరు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకళల పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి.. టిటిడి ఛైర్మెన్ హామీ

- కృతజ్ఞతలు తెలిపిన ఆర్‌ఎస్‌ఆర్



నెల్లూరులోని చరిత్రాత్మక దేవాలయ మైన గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని అభివృద్ధి చేసేం దుకు తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి హామీ ఇచ్చారని ఇరుకళల అమ్మవారి దేవాలయం ఛైర్మెన్ ఆర్.శ్రీనివాసరావు(ఆర్‌ఎస్‌ఆర్) తెలియ జేశారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచనలతో ఈనెల 27న తాడేపల్లిలో టిటిడి బోర్డు ఛైర్మెన్‌ను ఆర్‌ఎస్‌ఆర్ కలి శారు. జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జె.శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ ఇఒ బొగ్గల మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన అర్చకులు పులికొలను చంద్రశేఖర్, కొవ్వాకొల్లు మధుసూదన్, సుతారం సురేష్, కురిచేటి వీరాచారి, వెంకటరమణ తది తరులతో కలిసి ఆలయం తరపున వైవి సుబ్బారెడ్డిని గౌరవపూర్వకంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి 2.5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలను వారు ఆయనకు అందజేశారు. అందుకు వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని, వారిచ్చిన భరోసాతో ఆలయ అభివృద్ధికి మార్గం సుగమమైందని ఆర్‌ఎస్‌ఆర్ ఆనందం వ్యక్తం చేశారు. ఆ నిధులొస్తే ఆలయంలో మహామండప నిర్మాణం, ప్రాకారం, ప్రధాన ద్వారం, ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ చేయడం వంటి పనులన్నీ ముమ్మరంగా జరుగుతాయని ఆయన తెలిపారు.




# శ్రీసిటీలో శ్రీవర్షిత అద్భుత నాట్య ప్రదర్శన

శ్రీసిటీలోని సాహిత్య ఆధ్యాత్మిక వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఈనెల 24న నిర్వహించిన చిన్నారి శ్రీవర్షిత భరతనాట్య ప్రదర్శన అందరినీ బాగా అలరించింది. స్థానిక శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత విఘ్నేశ్వర ప్రార్థనతో నృత్య ప్రదర్శనను ప్రారంభించిన శ్రీవర్షిత, పలు భక్తిగీతాలకు అద్భుతమైన అభినయంతో నాట్యం చేసి అందరి ప్రశంసలందుకుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు గ్రామానికి చెందిన ఆ చిన్నారి ప్రతిభను అభినందిస్తూ శ్రీసిటీ-శ్రీవాణి నిర్వాహకులు ఆ చిన్నారికి జ్ఞాపికను అందజేశారు.

# అసత్యమేవ జయతే!... అబద్ధమే అసలైన నిజం...!




గాలి, నీరు, ఆహారం... అనే మూడూ మనకు జీవనాధారం అని అనుకుంటూ ఉంటాం. చదువు సంధ్యలు, బుద్ధీ-జ్ఞానం, పరువు - ప్రతిష్ఠ, మానాభిమానాలు, సిగ్గూ-శరం లేకపోయినా బతికేయవచ్చు గానీ... గాలి, నీరు, ఆహారం లేకుండా ఒక్కరోజు కూడా బతకలేం. ఔనా?!

అయితే, ఈ మూడింటికి తోడు, ఇంకోటి లేకుండా కూడా మనకు ఒక్కరోజూ గడవదు. అదే - అబద్ధం... అసత్యం. జీవనానికి అదో పరమౌషధం.

మాటలు రాని మూగవారిని మినహాయిస్తే అప్పుడప్పుడే మాటలు వస్తున్న పిల్లల నుంచి.... ఇక కొద్ది గంటల్లో మాటలు ఆగిపోయే వృద్ధులు, రోగులు, క్షతగాత్రుల వరకు అబద్ధం అనేది మనిషికి అత్యంత ప్రియమైనది. భార్యాపిల్లల కంటే కూడా ప్రియమైనది. జీవితంలో దేనికంటే కూడా ప్రియమైనది. పుల్లారెడ్డి స్వీట్స్‌లో జీడిపప్పు మిఠాయి లాంటిది.

తిండీ తిప్పలు లేకుండా కూడా ఎలాగోలా కొన్ని రోజులైనా బతకవచ్చు కానీ అబద్ధాలు ఆడకుండా బతకమంటే... 'నా వల్ల కాదు' అంటూ చేతులెత్తేస్తారు.

అయితే, అబద్ధం ఆడడం అంత తేలికైన విషయం కాదు. అబద్ధం ఆడితే, గోడ కట్టినట్టుగా ఉండాలంటారు. అలా ఉండాలంటే... ఎంత టాలెంట్ ఉం డాలి? ఎంత కలర్‌ఫుల్‌గా చెప్పాలి? ఒక అబద్ధాన్ని రెండు... మూడుసార్లు చెప్పాల్సివస్తే తేడాలు రాకుండా చెప్పడానికి బోలెడంత జ్ఞాపకశక్తి ఉండాలి. అలా చెప్పే టాలెంట్ లేకనే, చాలామంది రాజకీయ నేతలు జనానికి దొరికిపోతూ ఉంటారు. అమెరికాలో మన ప్రధాని అక్కడి వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు సమక్షంలో అమెరికా విలేకరుల నోళ్లు మూయించారు. 'మీ దేశంలోని మైనారిటీ ముస్లింలపై వివక్ష గురించి ఏం చెబుతారు?' అని ఓ విలేకరి ప్రశ్నిస్తే.. మన మోదీ ఆశ్చర్యపోయారు.

'వివక్షా! అది మా డీఎన్ఏలోనే లేదు. కుల, మత, ప్రాంత తేడాలు లేకుండా అందరినీ సమానంగా చూసే సంస్కృతి మాది' అని బల్లగుద్ది చెప్పారు. ఇలా చెప్పాలంటే, అద్భుతమైన టాలెంట్ ఉండాలి.

అదే నిజం చెప్పడానికి, టాలెంట్ ఏమీ అవసరం లేదు. ఎన్నిసార్లయినా గడగడా చెప్పేయవచ్చు. చెప్పేదాంట్లో తేడాలు ఉండవు.

ఆ మధ్య అమెరికాలో... పెద్దవాళ్ళు రోజుకు ఎన్ని అబద్ధాలు ఆడతారు అని తెలుసుకోడానికి ఒక సర్వే చేశారు. ఓ వెయ్యి మంది నుంచి సమాధానాలు సేకరించారు. తాము రోజుకు కనీసం మూడు అబద్ధాలైనా(ముఖ్యమైనవి) ఆడతామని సర్వేలో పాల్గొన్నవారు చెప్పారు. అంటే.. నెలకు 90. ఏడాదికి సుమారు 1080 అబద్ధాలు. అమెరికా కాబట్టి, నిజాయతీగా చెప్పారు. మన దగ్గర ఎవరైనా అటువంటి సర్వే చేస్తే.. "అబద్ధమా ? నేనా? ఛ.. ఛ. 'అబద్ధం' అనేది మా వంశంలోనే లేదు" అనడానికే అవకాశం ఎక్కువ.

అసత్యం ఆడడం వల్ల మనిషికి ఎన్ని లాభాలో చెప్పడానికి వీలులేదు. అలవోకగా అబద్ధం ఆడడం అనేది, నిజానికి మనిషికి దేవుడు ఇచ్చిన వరం. సమ్మోహనాస్త్రం. అదే గనుక లేకపోయినట్లయితే నూటికి ఎనభై శాతం కాపురాలు ఔట్. కోర్టుల్లో కేసులు వాదించే న్యాయవాదుల్లో సగం మందికిపైగా ఔట్ . రాజకీయ నాయకులు నూరు శాతం ఔట్. పోలీసుల పని... 95 శాతం ఔట్. ఈ చేత్తో మర్డర్ చేసి, ఆ చేత్తో వేరేవాళ్ళ ఖాతాకు జమ చేద్దాం అనుకునే వారి పని ఔట్. రౌడీషీటర్ల పని ఔట్. ఆఫీసర్ల పని ఔట్. ఎంఎల్ఏలు, మంత్రుల పని ఔట్. వారికి ఉపన్యాసాలు రాసిపెట్టే వారి పని ఔట్. కాంట్రాక్టర్ల పని ఔట్. కార్పొరేట్ ఆసుపత్రుల పని ఔట్. తెల్లకోటు, మెడలో స్టెతస్కోప్ ఒకటి వేసుకుని, ఆ కార్పొరేట్ ఆసుపత్రుల్లో అటూ ఇటూ సీరియస్‌గా కారిడార్లలో తిరిగే డొనేషన్ డాక్టర్ల పని ఔట్. వ్యాపారాలు చేసే వారి పని ఔట్. అంబానీ, అదానీ పని ఔట్. ఒకటి అనేమిటి.... అసలు జన జీవనం పనే ఔట్. మీడియా పనీ ఔట్. అసలు, సమాజ గమనమే స్తంభించిపోతుంది.

అందుకే, అబద్ధాలు ఆడకపోతే మనిషికి ఎదు రయ్యే కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ భగవంతుడే... ఈ యొక్క అబద్ధం అనే సమ్మోహనాస్త్రాన్ని మనిషి యొక్క చేతికి అందించాడు. మానవాళికి భగవం తుడు అందించిన ఈ సదవకాశాన్ని మరింత సాన బెట్టడానికి వీలుగా... మన యూనివర్సిటీలు అబద్ధా లలో ఓ డిప్లొమా కోర్స్ ప్రారంభించాలని విన్నపం.

- గోడ కట్టినట్టుగా అబద్ధాలు ఆడుట,
- అబద్ధాలు - సామాజిక ప్రయోజనాలు,
- రాజకీయాలలో అబద్ధాల పాత్ర,
- అబద్ధాలు ఆడదాం - ప్రపంచాన్ని గెలుద్దాం

రండి... మొదలైన టాపిక్స్‌తో సిలబస్ రూపొం దించి... భావిభారత నేతలను రూపొందించడంలో మన విశ్వవిద్యాలయాలు తమ పాత్ర పోషించాలి.

అసలు, వెయ్యి అబద్ధాలు ఆడైనా సరే.... ఒక పెళ్లి చెయ్యమని మన పెద్దలు చెప్పారా... లేదా?






నాత్రోజులు కాపురం చేసి విడిపోయే పెళ్లిళ్ల కోసమే వెయ్యి అబద్ధాలు చెప్పినా తప్పు లేదని మన పెద్దలు చెబితే... అనేక తరాలు, వారి తరాలు, వారి తరాలు సంపాదించుకోవలసిన పని ఏమీ లేకుండా దేశం మీదపడి పోరంబోకుల్లా బతకడం కోసం... రాజమార్గం లాంటి రాజకీయ పదవులు సంపాదించుకోడానికి ఎన్ని అబద్ధాలు ఆడాలి? మరి, మన నేతలు అన్ని ఆడుతున్నారా? మహా అయితే... ఓ నాలుగైదొందల అబద్ధాలేగా ఆడు తున్నది! ఆ మాత్రం దానికే, అబద్ధాలు "వర్క్ ఔట్" అయినవారిపై, అవి "వర్క్ ఔట్" కానివారు పడి పోయి, ఏడుపులు, పెడబొబ్బలు, శాపనార్థాలు.... పెడితే ఎలా? సహనం ఉండాలి కదా! ఇప్పుడు 'వర్క్ ఔట్' కానివారికి.... రేపు 'వర్క్‌ఔట్' కావచ్చు. ఇప్పుడు అబద్ధాలు వర్క్ ఔట్ అవుతున్నవారికి... రేపు కాకపోవచ్చు.

కొత్త అబద్ధాలు నేర్చుకుందాం... జనానికి టోపీ వేద్దాం అని లేకుండా, వర్క్‌ఔట్ అవుతున్న వారిని చూసి, గుండెలు బాదుకో వడం... రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్య వ్యతిరేకం. (మన నేతలకు తెలిసింది ఈ రెండు పదాలే)

చెప్పిన అబద్ధాలే.... మళ్ళీ మళ్ళీ చెబుతూ కూడా... జనాన్ని రంజింప చేయగలగడం మాత్రం నిజంగా ఓ అద్భుత కళ.

మన రోజువారీ జీవితంలో... మనకు తెలియకుండానే బోలెడు అబద్ధాలు అలవోకగా ఆడేస్తుంటాం. మచ్చుకు కొన్ని.

- ఫోన్ చేద్దామని అనుకుంటూనే మర్చిపోతున్నాను. బిజీబిజీ కదా... సారీ!
- బిజీగా ఉండి ఫోన్ ఎత్తలేదు....
- సారీ సార్, ఫోన్ సైలెన్స్‌లోకి వెళ్లి ఉంటుంది. అందుకే ఎత్తలేదు....
- మీ స్పీచ్ అదిరిపోయింది సార్.
- మీరేం మారలేదు సార్. ఇదివరకు లాగానే ఉన్నారు....
- ఇంటికి రావడం లేటయింది. ఏం చెయ్యను మరి, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయా...
- మీకెందుకు శ్రమ?... నాకు వదిలేయండి. రేపు మీ పని చేసేస్తాగా...
- చాలా సంతోషం సార్. మీ దర్శనం చేసుకున్నాను....
- ఇది రేట్ ఎక్కువ అంటారా? మరి మా షాప్‌లో క్వాలిటీ తేడా ఉంటుంది సార్. మనది నెంబర్‌వన్.
- ఈ చీర చాలా బాగుంది వదినా...!

ఇక ఇప్పుడు ఎలక్షన్ సీజన్‌లోకి అడుగుపెడుతున్నాం. నోటి యాత్రలు, పాదయాత్రలు, బస్సు యాత్రలు, మీడియా యాత్రలు, డిబేట్ యాత్రలు, హామీ యాత్రలు, కుల యాత్రలు, నోటు యాత్రలు, వరస కుదరకపోతే లాఠి యాత్రలు.... ఇలా చెప్పలేనన్ని యాత్రలు.... చెప్పలేనన్ని మార్గాల్లో మన మీద దండయాత్రలకు బయలుదేరే టైమ్ వచ్చేసింది.

ఈ రకమైన రాజకీయ యాత్ర ఏదయినా... చక్కని, వినసొంపయిన అబద్ధాల వలలను జనం మీదకు విసరడమే లక్ష్యంగా సాగుతూ ఉంటాయి. కొన్ని యాత్రలు ఆల్‌రెడీ బయలుదేరిపోయాయి. ఇవన్నీ కలుపుకుంటే.... రోజుకు ఎన్ని పదులు... వందలు.... వేల అబద్ధాలో కదా?

గ్రామ/మునిసిపల్ వార్డు దగ్గర నుంచి... ప్రధానమంత్రి వరకు ఎవరి ప్రసంగం అయినా సరే.... విని చూస్తే అసత్యాలకు మన నేతలు ఇచ్చే గౌరవం, ప్రాముఖ్యం, విలువ తెలిసివస్తుంది.

ఎన్నికలు పూర్తయి ఎవరి అబద్ధాలను ఓటర్లు వరించారో అనే విషయం తెలుసుకునేసరికి, ఎన్ని లక్షల అబద్ధాల వర్షంలో మనం తడిచి ముద్దయిపో తామో కదా!

నలుగురితో నారాయణ(సీపీఐ నారాయణ కాదు), కులంతో గోవిందా అన్నారు, పెద్దలు.

అందుకే, సమాజ పోకడకు అనుగుణంగా, సాక్షి మీడియా కూడా, " సత్యమేవ జయతే ..!" అంటూ మరీ చాదస్తానికిపోయి... మడి కట్టుకుని కూర్చోకుండా ఓపికున్నంత వరకు, అసత్యాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

అసత్యాలే మన ప్రజాస్వామ్యానికి శ్రీరామ రక్ష. అసత్యమే సత్యం! మిగిలిందంతా మిథ్యే.

A lie is the basis for everything.

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# ఉత్తర అమెరికా తెలుగు సమితి

## 5వ ద్వైవార్షిక సమావేశాలకు విచ్చేస్తున్న

# తెలుగు కుటుంబానికి స్వాగతం..! సుస్వాగతం..!!

**తెలుగుజాతి మనది - నిండుగ వెలుగు జాతి మనది**

మనమంతా తెలుగువాళ్ళం. మనదంతా ఒకే కుటుంబం. ఖండాంతరాలు దాటి వచ్చి,
మన ప్రతిభా ప్రావీణ్యాలతో... మన తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తి చేస్తున్న ఘనత మనది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా..
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలపరా నీ జాతి నిండు గౌరవము"..
అన్న రాయప్రోలు సుబ్బారావు మాట స్ఫూర్తిగా...



"మా తెలుగు తల్లికి మల్లెపూదండ..
మా కన్నతల్లికి మంగళారతులూ
కడుపులో బంగారు - కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి"..
అన్న శంకరంబాడి సుందరాచారి పాట ఆదర్శంగా...

భరత జాతి గౌరవాన్ని చాటుతూ, తెలుగువారి సత్తాని చూపుతూ
నిరంతరం ముందుకు సాగుతున్న తరం మనది.

కరోనా మిగిల్చిన చేదు జ్ఞాపకాల నుండి కోలుకుంటూ,
5 సంవత్సరాల తరువాత మళ్ళీ మనమంతా ఒక వేదికపై చేరుతున్నాం.

అంబరాన్ని తాకే ఆడంబర సంబరంగా **జూన్ 30, జూలై 1, 2 తేదీలలో**
టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో మనం జరుపుకోబోతున్న

**ఉత్తర అమెరికా తెలుగు సమితి**

**5వ ద్వైవార్షిక సమావేశాలకు**

ప్రపంచం నలుమూలల నుండి విచ్చేస్తున్న తెలుగు వారికి,
అమెరికా నలుచెరగులా విస్తరించివున్న నా ఆప్త తెలుగు బంధువులకు, ఆత్మీయ సింధువులకు


*నా హృదయపూర్వక స్వాగతం..! సుస్వాగతం..!!*

**తెలుగుజాతి మనది - నిండుగ వెలుగు జాతి మనది...**

అని సగౌరవంగా చాటుకుందాం.
ఈ తెలుగు సంబరాన్ని ఆనంద సంరంభంగా జరుపుకుందాం...

తెలుగువారి శ్రేయోభిలాషి, సేవాభిలాషి

**డాక్టర్ ప్రేమ్‌రెడ్డి**
చైర్మెన్, ఎమిరటస్



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com